J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

లాయర్

సంపుటి : 42 సంచిక : 2 17.6.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

అధికారమే అజెండాగా..

## రాష్ట్రపతి ఎన్నికతో రాజకీయ సందడి

# కలిసిన నేతలు.. కలవని దారులు

- గుప్పెట తెరవని అధికారపక్షం.. అయోమయంలో ప్రతిపక్షం
- అధికారం కేంద్రానిది.. హడావుడి ప్రతిపక్షాలది
- కనిపించని సహకారం.. కెసిఆర్, జగన్‌లు దూరం

***దేశ 15వ రాష్ట్రపతి ఎవరు? ప్రధానమంత్రి ఒక్క మోడీ(అమిత్‌షాను కలుపుకుని)కి తప్ప 140 కోట్ల జనాభాలో మరొకరికి ఈ క్షణాన జవాబు తెలియని ప్రశ్న ఇది. అది తెలుసుకోడానికి మరో వారం రోజుల పాటు దేశం ఎదురు చూడాల్సి ఉంది. ఈలోగా, బీజేపీతో సహా దేశంలోని చిన్న, పెద్ద రాజకీయ పార్టీల నేతలందరూ ఎవరి ఆట వారు ఆడుతున్నారు. ఎవరి రాజకీయం వారు చేస్తూ తమ ఉనికిని తెలిపే ప్రయత్నం చేస్తున్నారు.***

ముందుగా రాష్ట్రపతి అభ్యర్థిని 'ఏకాభిప్రాయం'తో ఎంపిక చేయాలనే మహత్తరాశయంతో ప్రతిపక్షాలను సంప్రదించి, వారి మద్దతు కూడగట్టడానికి రక్షణ మంత్రి రాజనాథ్‌సింగ్, బీజేపీ అధ్యక్షుడు జెపీ నడ్డాను రంగంలోకి దింపింది మోడీ బృందం.

'ప్రజాస్వామిక నియంతృత్వా'న్ని విజయవంతంగా అమలు చేయడంలో కొత్త పుంతలు తొక్కుతున్న నరేంద్ర మోడి రాజకీయ మస్తిష్కంలో ప్రతిపక్షాలకు చోటే లేదు. అసలు ఆయనకు ఆ వాసనే పడదు. వీలైనంతవరకు, వాటిని హరించేయడమే ఆయన లక్ష్యం.

ఆంధ్రాలో ప్రతిపక్షం అన్నది ఉండగూడదని ముఖ్యమంత్రి జగన్ భావిస్తున్నట్లుగానే, దేశంలో బీజేపీకి ప్రతిపక్షమే లేకుండా చేయాలన్నది మోడి లక్ష్యం. ఈ నేపథ్యంలో, 'ఏకాభిప్రాయం' అసాధ్యమని తెలిసినా, నామినేషన్‌కు గడువు వారానికిపైగా ఉండడంతో, చివరి నిముషం వరకు తన గుప్పెట మూసి ఉంచడానికి ఇబ్బంది లేకుండా చూడడం కోసం, 'ఏకాభిప్రాయం' వ్యూహాన్ని మోదీ బయటకు తీశారే తప్ప ప్రతిపక్షాలపై గౌరవంతో మాత్రం కాదు.

ఇక, పాతిక వరకు ఉన్న ప్రతిపక్ష పార్టీలు ఓ 'ఉమ్మడి అభ్యర్థి'ని నిలబెడదాం అనుకుంటున్నా కుదరడం లేదు. ఎవరి రాజకీయం వారిదైపోయింది. ప్రతిపక్ష శిబిరానికి చెందాల్సిన రెండు ముఖ్యమైన పార్టీలు, వైఎస్ఆర్‌సీపీ, టీఆర్ఎస్‌లు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. ఎందుకు చూడలేకపోతున్నారో కారణం కూడా చెప్పడం లేదు. మరో ముఖ్యమైన రాజకీయపార్టీ టీడీపీని పాపం రమ్మని ఎవరూ పిలవడం లేదు.

రాష్ట్రపతి పదవిపై ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి ఎవరు అన్న విషయంపై ఏకాభిప్రాయానికి రావడానికి వీలుగా, బెంగాల్ ముఖ్యమంత్రి 22 ప్రతిపక్ష పార్టీల నేతలను ఆహ్వానిస్తే... 16, 17 పార్టీల నేతలు హాజరయ్యారు. వచ్చినవారు, మహారాష్ట్ర నేత శరద్‌పవార్‌ను ముగ్గులోకి లాగడానికి చూశారు గానీ

10లో

# పాటకారి.. మాటకారి మన బాలు

**- వెంకయ్యనాయుడు**



- ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జీవిత కథ 'జీవన గానం' గ్రంథాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి
- తొలి ప్రతిని అందుకున్న 'పద్మభూషణ్' కమల్‌హాసన్

***జూన్ 10వతేదీ శుక్రవారం సాయంత్రం హైదరాబాదులోని 'దసపల్లా' హోటల్‌లోని కన్వెన్షన్ హాల్ జాతీయస్థాయి సినీ రాజకీయ ప్రముఖులతో పాటు, సంగీత సాహిత్య అభిమానులతో క్రిక్కిరిసిపోయింది. 'భారతీయ సినిమా గాయకులు' మన నెల్లూరు గానాలపట్టి శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యంను తలచుకుని నాటి కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అతిరథమహారథుల గుండె బరువెక్కింది.***

5లో





# శంఖవరంలో.. గంగమ్మతల్లికి పొంగళ్ళు

వింజమూరు మండలంలోని శంఖవరం గ్రామంలో ఇటీవల గ్రామదేవత గంగమ్మతల్లికి గ్రామస్తులు పొంగళ్ళ వండి నైవేద్యంగా సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళాభక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారి ఆలయానికి తరలివెళ్ళి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని శోభాయ మానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ధీరవనిత.. పొణకా కనకమ్మ

**రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి**



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, నెల్లూరులోని కస్తూరిదేవి విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు, పల్లిపాడు పినాకినీ గాంధీజీ ఆశ్రమం స్థల దాత దివంగత పొణకా కనకమ్మ ఆశయాల బాటలో అందరూ నడవాలని నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పొణకా కనకమ్మ 131వ జయంతి సందర్భంగా జూన్ 10న పల్లిపాడు పినాకిని గాంధీజీ ఆశ్రమంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో ధీరవనిత కనకమ్మ సేవలు స్ఫూర్తిదాయకమని, స్త్రీవిద్య కోసం ఆమె ఎంతగానో పాటుపడ్డారని కొనియాడారు. తొలుత ఆశ్రమంలోని మహాత్మాగాంధీజీ, కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. ఆశ్రమ కన్వీనర్ గణేశం కల్పనమ్మ మాట్లాడుతూ కనకమ్మ దేశభక్తి, సమాజ సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, గంపల మంజుల, సుధారాణి, విజయమ్మ, అల్లాబక్షు, నిరంజన్‌రెడ్డి, కోటారెడ్డి, సర్పంచ్ సుధాకర్, ఆశ్రమం మేనేజర్ సాయిమనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## వారి సేవలు చిరస్మరణీయం :

పొణకా కనకమ్మ, కవికోకిల దువ్వూరు రామిరెడ్డిల జయంతిలను పురస్కరించుకుని నెల్లూరు వర్ధమాన సమాజం గ్రంథాలయంలో పొణకా కనకమ్మ ఆశయసమితి కన్వీనర్ సురేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 10న వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు ఆ మహనీయుల సేవలను స్మరించుకుని నివాళులర్పించారు. నగర మేయర్ స్రవంతి పాల్గొని కనకమ్మ పోరాటస్ఫూర్తిని వివరించారు. నేటితరం యువత నాటి స్వాతంత్ర్యయోధులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం కనకమ్మ చిత్రపటంతో పాటు జిల్లాకు చెందిన పలువురు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుల చిత్రపటాలను మేయర్ ఆవిష్కరించారు. ఇటీవల టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు మునిసిపల్ పాఠశాలల విద్యార్థులకు రామచంద్రనాయుడు జ్ఞాపకార్థం రంగయ్యనాయుడు నగదు బహుమతులందించారు. డాక్టర్ భట్టారం విశ్వేశ్వర సుబ్రహ్మణ్యం, గూడూరు లక్ష్మి, షేక్ సందానిబాషా, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, మక్కెన అంకయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమసంఘం.. కొత్త కార్యవర్గం



కొత్తగా ఎంపికైన కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న శంకరయ్య

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నెల్లూరులోని 54వ డివిజన్ శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈనెల 12న నెల్లూరులోని బీసీ సంక్షేమసంఘం కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షునిగా పెంచలయ్య, కార్యదర్శిగా నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసులు, పుల్లయ్య, మహేశ్వర్, మోహన్, రమణయ్య, తిరుపతి నియమితులయ్యారు. సంఘం నగరాధ్యక్షుడు జ్ఞానేంద్ర, లక్ష్మణ్‌రాజు, జయరామరాజు, చంద్ర, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ

# దైవభక్తితో జీవించాలి

**- కమలానంద భారతిస్వామి ఉద్బోధ**



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో శ్రీ కమలానంద భారతి స్వామి

సమాజంలో ప్రతిఒక్కరూ దైవభక్తితో జీవించాలని, ధర్మనిరతితో అందరూ జీవితాలను సాగించాలని హిందూ దేవాలయాల ప్రతిష్ఠాపన పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కమలానందభారతి స్వామి ఉద్బోధించారు. ఇటీవల కోవూరు శాంతినగర్ 1వ వీధిలో గ్రామదేవతలు పోలేరమ్మ అమ్మవారు, పోతురాజుస్వామిల విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. మన హిందూ ధర్మం, సంస్కృతి సంప్రదాయాలు ఎంతో సనాతనమైనవని, వాటిని అందరూ ఎల్లప్పుడూ పరిరక్షించుకోవాలని చెప్పారు. అనంతరం కోవూరులోని సుభాష్ సేవా సంఘం అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, శ్రీవారి సేన సంస్థల ఆధ్వర్యంలో కమలానంద భారతి స్వామిని సత్కరించారు. మండల బిజెపి అధ్యక్షుడు రఘురామయ్య, సీనియర్ నాయకులు చక్రవర్తి, వెంకటేశ్వర్లు, ప్రసాద్, పరంధామిరెడ్డి, రాజేష్, విజయ సాయిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విగ్రహప్రతిష్ఠ కార్యక్రమ నిర్వాహకులు, పెద్దసంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ నగర్‌లో..

# పోలీసుల కార్డెన్ సర్చ్

**16 మంది అనుమానితులు.. అదుపులోకి**



నెల్లూరు శివారుల్లోని వైఎస్సార్ నగర్‌లో ఇటీవల పెద్దఎత్తున పోలీసులు పాల్గొని కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఏఎస్పీ (క్రైమ్స్) ఆధ్వర్యంలో నగర డిఎస్పీ కె. హరినాథ్‌రెడ్డి, పలువురు ఎస్‌ఐలు, 300 మంది పోలీసులు అన్ని ఇళ్ళనూ తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న 16 మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పత్రాలు సరిగా లేని 71 ద్విచక్రవాహనాలను, ఒక స్కోడా కారును, అయిదు ఆటోలను సీజ్ చేశారు. ఓ ఇంట్లో విక్రయించడానికి సిద్ధంగా ఉన్న నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు.

నేరాలు కట్టడిచేసేందుకు శివారు ప్రాంతాల్లో ఇలాంటి తనిఖీలు నిర్వహిస్తున్నామని ఏఎస్పీ చెప్పారు. అపరిచిత వ్యక్తులు కనిపించినా, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిసినా అలాంటివారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఆమె ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వెంగమాంబ పేరంటాలు అమ్మవారి..

# బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలంలోని నర్రవాడ గ్రామంలో వెలసివున్న శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆలయ నిర్వాహకులు ఇటీవల ఆవిష్కరించారు. ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలను ఈసారి వైభవోపేతంగా నిర్వహించనున్నామని వారు ఈ సందర్భంగా చెప్పారు. బ్రహ్మోత్సవాలకు పెద్దఎత్తున భక్తులు తరలిరానుండడంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పచ్చవ కరుణాకర్‌బాబు, తుమ్మల వెంకట సురేష్‌బాబు, ఇ.ఒ ఆర్ వెంకటేశ్వర్లు బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలుకుతూ పోస్టర్లను విడుదల చేశారు. గ్రామ సర్పంచ్ నాగయ్య, ఎంపిడిఒ సాయిప్రసాద్, ఎస్‌ఐ బాజిరెడ్డి, వైకాపా మండల కన్వీనర్ వాసిపల్లి వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

# యోగ సాధన ఎంతో మంచిది

**స్వామి నిర్మలానందగిరి**

యోగ సాధన చేయడం ఎంతో మంచిదని, అటు శారీరకంగానూ ఇటు మానసికంగానూ ఆరోగ్యంగా ఉండేందుకు యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని, మనసుకు ప్రశాంతతను కలిగిస్తుందని స్వామి నిర్మలానందగిరి అన్నారు. ఈనెల 12న పొదలకూరులోని రామమందిరం వద్ద యోగా గురువు సిహెచ్ పెంచలయ్య ఆధ్వర్యంలో ఏర్పాటైన 'నిత్య యోగ కేంద్రాన్ని' స్వామీజీ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగ సాధన చేసి ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం గాయత్రి హోమం నిర్వహించారు. యోగ కేంద్రం ఆధ్వర్యంలో యోగాసనాలను ప్రదర్శించారు. ఆ తర్వాత నజీర్‌బాషా గురూజీ ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచనం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం చినబ్రహ్మయ్య, లక్కాకుల ఆనందరావు, ఎన్.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకం మానండి

పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకం మానేయాలని, వాటి స్థానంలో జనపనార సంచులను (ఆర్గానిక్ బ్యాగ్స్) వినియోగించుకోవాలని మనుబోలులోని సేవానాధం ట్రస్ట్ ప్రతినిధులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు జడ్పీటిసి చిట్టమూరు అనితమ్మ చేతులమీదుగా ఈనెల 13న జనపనార సంచులను ఇంటింటికీ పంపిణీ చేశారు. మండలంలో సుమారు 10వేల జనపనార బ్యాగ్‌లను పంపిణీ చేయనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు చిట్టమూరు అజయ్‌రెడ్డి, అనమాల ప్రభాకర్‌రెడ్డి, ట్రస్ట్ కోఆర్డినేటర్లు మహీధర్‌రెడ్డి, కావేటి భార్గవ్, సభ్యులు గిరి, ఆశిక్, పవన్, సురేష్, లాజర్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల పరిధిలో..

# ఇక గ్రామస్థాయిలోనూ క్రీడాక్లబ్‌లు

గ్రామస్థాయి నుంచి క్రీడారంగాన్ని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సచివాలయాల పరిధిలో ఒక ఉద్యోగిని నియమించి, 'శాప్' సహకారంతో ఆ ఉద్యోగి ద్వారా క్రీడాపోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. 'జగనన్న క్రీడాక్లబ్'ల పేరుతో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి గ్రామంలోనూ క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నదే ప్రధాన ఆశయం. ప్రతి గ్రామంలో ప్రతి మూడునెలలకోసారి క్రీడా పోటీలు నిర్వహించాల్సి ఉంటుంది. తాజాగా ఆ మేరకు జిల్లాకు ఉత్తర్వులు కూడా వచ్చాయి. దాని ప్రకారం శాప్ పర్యవేక్షణలో స్థానికంగా ఉండే ఫిజికల్ డైరెక్టర్, పిఇటిలను క్రీడాక్లబ్బుల్లో సమన్వయకర్తలుగా నియమించనున్నారు. ఒక్కో క్రీడకు ఒక్కో క్లబ్ వంతున 25 క్రీడాంశాలకు క్లబ్‌లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి స్పోర్ట్స్‌క్లబ్‌కి అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి, క్లబ్ పాలకమండలి సభ్యులను కూడా నియమిస్తారు. ప్రతి మూడునెలలకోసారి జిల్లాస్థాయి, మండలస్థాయి, నియోజకవర్గస్థాయిల్లో పోటీలు నిర్వహించి ఆ వివరాలను శాప్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేకయాప్ ద్వారా పర్యవేక్షిస్తారు. క్రీడల నిర్వహణ కోసం మండలస్థాయి, గ్రామస్థాయిల్లో స్పోర్ట్స్ అథారిటీలు ఏర్పాటు కానున్నాయి. పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామానికి చెందిన జిల్లాస్థాయి క్రీడాకారుడు లేదా క్రీడాభివృద్ధికి సహకరించే దాతలు, పిఇటిలు ఇందులో సభ్యులుగా ఉంటారు. జడ్పీటిసి, ఎంపిటిసిలు సర్పంచ్ సహకారంతో క్రీడాక్లబ్‌ల నిధులు సమకూర్చుకుని క్రీడాభివృద్ధికి కృషిచేయాలి. అదేవిధంగా మండల స్పోర్ట్స్ అథారిటీలో ఎంపిపి ఛైర్మెన్‌గా ఉంటారు. తహశీల్దారు, ఎంపిడిఒ, రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు, మండల విద్యాశాఖ అధికారి, ఎస్‌ఐ, ఏఇ, పీడీ, ప్రిన్సిపల్‌స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రతినెలా ఈ స్పోర్ట్స్ అథారిటీలు సమీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధుల నుంచి 4 శాతం నిధులను ఈ క్రీడాక్లబ్‌ల నిర్వహణకు కేటాయించేలా చర్యలు చేపట్టనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో

# జూన్ 26న అన్నమయ్య జయంతి

## 'వాచస్పతి' బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి ప్రవచనం





శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి 613వ జయంత్యోత్సవం జూన్ 26వ తేది ఆదివారం నెల్లూరు నగరంలో జరగనుంది. సాయంత్రం 4.25 గంటలకు మినీబైపాస్ రోడ్డులోని అన్నమయ్య విగ్రహం వద్ద పూజతో కార్యక్రమం మొదలవుతుంది. అనంతరం అన్నమాచార్యుల వారి సంకీర్తనాలాపన చేసుకుంటూ విగ్రహ సమీపంలో ఉన్న పి.వి.ఆర్ కళ్యాణ మండపానికి చేరుకొని అక్కడ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మినీబైపాస్‌లోని అన్నమయ్య సర్కిల్‌లో 2012లో అన్నమాచార్యుల వారి విగ్రహం నెలకొల్పిన తరువాత 'శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ' ఏర్పడి ఆనవాయితీగా ప్రతి ఏటా జయంతి ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తోంది. 2019 తరువాత కోవిడ్, తదితర కారణాలవల్ల మూడేళ్ళుగా జయంతి కార్యక్రమం జరగలేదు. ఈ ఏడాది నుండి ఇక ప్రతి ఏడాది జూన్ రెండు లేదా మూడవ వారంలో అన్నమయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా ఘనంగా నిర్వహించడానికి కమిటీ నిర్ణయించింది.

### బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారిచే ప్రవచనం...

ఈ ఏడాది అన్నమయ్య జయంతి కార్యక్రమంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. సాయంత్రం విగ్రహం వద్ద జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం పక్కనే ఉన్న పివిఆర్ కళ్యాణ మండపంలో ఆయన ప్రవచనం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ పారిశ్రామికవేత్త, సాహితీప్రియులు 'పద్మభూషణ్' డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, అన్నమాచార్య జయంతి కమిటి అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానాల ఉత్తర భారత స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గౌరవ అతిథులుగా పాల్గొంటారు.

### పాసులు ఉండాలి... సంప్రదాయ దుస్తులు ధరించాలి

ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు ఖచ్చితంగా పాసులు కలిగి ఉండాలి. సంప్రదాయ దుస్తులు ధరించిన వారికి మాత్రమే ప్రవేశం. పాసులు ఎక్కడ పొందాలి, కార్యక్రమానికి ఎన్ని గంటలకు రావాలి తదితర వివరాలు త్వరలో తెలియజేస్తామని కమిటి సభ్యులు తెలిపారు.

# డాక్టర్ బిందుమీనన్‌కు.. రెండు ప్రతిష్టాత్మక అవార్డులు



నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందుమీనన్ ఇటీవల రెండు ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. 'అమెరికన్ అకాడమి ఆఫ్ న్యూరాలజీ'తో పాటు 'అమెరికన్ బ్రెయిన్ ఫౌండేషన్' ఆమెకు ఈ అవార్డులను బహుకరించాయి. ఈ సందర్భంగా ఈనెల 15న నెల్లూరులో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్‌తో కలిసి డాక్టర్ బిందుమీనన్ విలేకర్లతో మాట్లాడుతూ ఏబి బేకర్ టీచర్స్ రికగ్నైజేషన్ అవార్డుతో పాటు, మృదా స్పిరిట్ ఆఫ్ న్యూరాలజీ అవార్డులు తనకు లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. 2022 సంవత్సరానికి సంబంధించి, న్యూరాలజీపై అవగాహన కల్పించినందుకు, రోగుల పట్ల మానవతా దృక్పథంతో ముందుకు సాగినందుకు, న్యూరాలజీ సేవలను విస్తృతం చేసినందుకు మృదా స్పిరిట్ ఆఫ్ న్యూరాలజీ అవార్డును ప్రదానం చేశారని ఆమె తెలిపారు. న్యూరాలజీకి సంబంధించిన టీచింగ్ విషయంలో ముఖ్య భూమిక పోషించడం, రానున్న రోజుల్లో న్యూరాలజీ ప్రాముఖ్యత ఎలా ఉంటుందో తెలియజేసినందుకు ఏబి బేకర్ టీచర్స్ రికగ్నైజేషన్ వారు అవార్డును ప్రదానం చేశారని అన్నారు. పేదవర్గాలకు న్యూరాలజీ సేవలను ఉచితంగా అందించడం కూడా ఈ అవార్డులు తనకు వచ్చేందుకు దోహదపడిందని ఆమె తెలిపారు. ఈ అవార్డులు తనపై మరింత బాధ్యతను పెంచాయని, రానున్న రోజుల్లో న్యూరాలజీ సేవలను అట్టడుగు వర్గాలకు సైతం అందించేందుకు కృషిచేస్తానని ఆమె చెప్పారు.

# భక్తజన సంద్రంగా.. గంగపట్నం

- నయనానందకరం.. చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవ వైభవం


సుడిమాను ఉత్సవం

ఇందుకూరుపేట మండలం గంగపట్నంలో కొలువైవున్న శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తుండడంతో గంగపట్నం భక్తజనసంద్రంగా మారిపోయింది. ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన సుడిమానోత్సవం ఈనెల 13న వైభవోపేతంగా జరిగింది. ఉదయం త్రిశూలేశ్వరస్వామి, చాముండేశ్వరిదేవి అమ్మవార్లకు ఆలయ అర్చకులు తీర్థవాది సముద్రస్నానాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చెంతనే ఉన్న సాగరతీరంలో పూజలు చేసిన అనంతరం పల్లిపాలెం దాకా పెద్దఎత్తున నిర్వహించిన గ్రామోత్సవంలో భక్తులు వందలాదిగా పాల్గొన్నారు. దారిపొడవునా భక్తజనం అమ్మవారికి గుమ్మడికాయలతో దిష్టితీసి కొబ్బరికాయలు సమర్పించి హారతులు పట్టారు. అనంతరం సుడిమాను ఉత్సవం కన్నులపండువగా జరిగింది. రాత్రి నిప్పులగుండం తొక్కేందుకు భక్తులు పోటీలు పడ్డారు. ఆ తర్వాత ఈనెల 14న ఆలయ పుష్కరిణిలో అమ్మవారి తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అధికారుల పర్యవేక్షణలో, అర్చకుల పూజలతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా.. నయనానందకరంగా జరిగాయి.




పెద్ద మనసుకు పెద్దల సభ

మన మస్తాన్‌రావుకి సముచిత స్థానం.



ఆత్మీయ అభినందనలతో...

నంబూరు మోహన్‌రావు

లాయర్
జూన్ 17, 2022

# ప్రపంచానికే వరం.. మన 'యోగా'



'ఆరోగ్యం మహాభాగ్యం' అన్నది మన ఆర్యోక్తి. ఆ మాటే ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడందరికీ జీవనవేదంగా మారిపోయింది. సకల మానవాళి సంపూర్ణ ఆరోగ్యానికి సంజీవని లాంటి 'యోగా'ను ప్రపంచానికి ఒక దివ్యమైనవరంలా ప్రసాదించింది మన భారతావని. ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే యోగ, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు వంటి యోగాసనాలు ఎంత ముఖ్యమో మన ప్రాచీన మహర్షులు తమ గ్రంథాల్లో వివరంగా తెలిపి ఉన్నారు. అలాంటి ఉత్తమోత్తమమైన యోగాను ప్రపంచవేదికపైకి తీసుకువచ్చి యోగాకు అంతర్జాతీయస్థాయి ఖ్యాతిని తెచ్చిపెట్టారు ప్రధాని మోడీ.

'ఆరోగ్యం మహాభాగ్యం' అన్నది మన ఆర్యోక్తి. ఆ మాటే ఇప్పుడందరికీ జీవనబాటగా మారిపోయింది. ఆరోగ్యం లేకుంటే ఎంత సంపద ఉన్నా సుఖం శాంతి ఉండవు. మనిషి తన జీవితాన్ని సక్రమంగా గడపాలంటే ఆరోగ్యమే ముఖ్యం. అందుకు మనసు-శరీరం రెండూ ఆరోగ్యంగా ఉండాలి. అందుకే యోగశాస్త్రాన్నంతా మధించి యోగాను మానవాళికి అందించిన ఆద్యుడుగా నిలిచిన పతంజలి మహర్షి 'యోగః చిత్తవృత్తి నిరోధః' అని సూత్రీకరించి యోగ గొప్పతనాన్నంతా ఒక్కమాటలోనే చాటారు. మనసు చంచలత్వాన్ని నిరోధించేదే..యోగ అన్నారాయన. చంచలమైన మనసును ఏకాగ్రతతో నిలకడగా నిలపగలిగే సాధనమే యోగా అని స్పష్టం చేశారు. అంతేకాదు, యోగ అంటే.. భారతీయ ఆధ్యాత్మికత్వంలో ఒక భాగం. అది వ్యాయామ సాధనల సమాహారం. ధ్యానంతో భగవంతునిపై చిత్తాన్ని నిలిపే ఏకాగ్రతను, మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వాన్ని యోగాతో సాధించవచ్చన్నదే సారాంశం. స్థిరంగా ఉండి సుఖాన్నిచ్చేదే ఆసనం. అది ఊరకే వచ్చేది కాదు సాధనతోనే సాధ్యమవుతుంది. అది భ్రూమధ్యంలో దృష్టిపెట్టడమైనా కావచ్చు, శ్వాస మీద ధ్యాస పెట్టడమైనా కావచ్చు అలాంటివన్నీ ఈ కాలం నాటి ఏకాగ్రతా సాధనాలే. అయితే యోగా అనేది ఇప్పటిదేమీ కాదు. యుగాల ముందునుంచే ఉంది. త్రేతా యుగంలోనూ రాజులు అంత్యకాలంలో యోగమార్గం ద్వారానే దేహాలను త్యజించే వారని 'యోగే నాన్తే తనుత్యజామ్'.. అని మహాకవి కాళిదాసు 'రఘువంశం'లో పేర్కొన్నారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, రామాయణ భారతేతిహాసాల్లోనూ, ప్రత్యేకించి భగవద్గీతలోనూ యోగ ప్రస్తావనలు లెక్కలేనన్ని ఉన్నాయి. ఎలాంటి ఆహారం తింటే మానవుడు ఆరోగ్యంగా ఉంటాడో, ఏవి తినవచ్చో ఏవి తినకూడదో, ఎలా ఉండాలో...ఎలా ఉండకూడదో...ఆహారపు అలవాట్లు ఎలా ఉండాలో, చుట్టూ పరిసరాలను ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యమో ఆ విషయాలన్నీ మహర్షులెప్పుడో గ్రంథాలకొద్దీ చెప్పారు. ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే యోగ, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు వంటి యోగాసనాల ద్వారా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో వివరంగా పేర్కొన్నారు. విశ్వశాంతిని కోరుకుంటూ సకల మానవాళి సంపూర్ణ ఆరోగ్యానికి సంజీవని లాంటి 'యోగా'ను ప్రపంచానికి ఒక దివ్యమైన వరంలా ప్రసాదించింది భారతదేశం. అలాంటి ఉత్తమోత్తమమైన యోగాను ప్రపంచ వేదికపైకి తీసుకువచ్చి భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఎంత గొప్పవో చెప్తూ యోగాకు అంతర్జాతీయ స్థాయి ఖ్యాతిని తెచ్చిపెట్టిన ఘనత ప్రధాని మోడీదే. అందుకే ఇప్పుడు మన యోగాకు మరింత ప్రఖ్యాతి. విశ్వవ్యాప్త విఖ్యాతి. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రపంచదేశాల్లోనూ యోగాకు ఇప్పుడెంతో ప్రాధాన్యత రావడం.. భారతదేశం గర్వించదగిన విషయం. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిఏటా జూన్ 21న జరుపుకోవాలని 2014 సెప్టెంబర్ 27న భారత ప్రధాని నరేంద్ర మోడీ ఐక్యరాజ్య సమితి(ఐరాస) సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదించి యోగాకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టారు. ఆ తీర్మానానికి అప్పట్లో 197 మంది ఐరాస ప్రతినిధుల్లో 175 మంది మద్దతునివ్వడం విశేషం. 2015 జూన్ 21 తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎంతో సంబరంగా జరుపుకోవడం ఒక గొప్ప విశేషం. నాటి నుంచి ప్రతిఏటా యోగ దినోత్సవాలు వేడుకగానే జరుపుకుంటున్నా 2019లో కరోనా రాకాసి విజృంభణతో యోగా సంబరాలు ఇళ్ళకే పరిమితమయ్యాయి. ఎట్టకేలకు ఇప్పుడు దేశంలో కరోనా వ్యాప్తి కాస్త తగ్గిన నేపథ్యంలో ఈ ఏడాది యోగ దినోత్సవాలు కొంచెం ఘనంగానే నిర్వహించుకునే అవకాశం ఉంది. అయితే, యోగా వంటి ఆరోగ్యకర కార్యక్రమాలు కేవలం ఆరోజు దినోత్సవాల రోజుకే పరిమితం కాకుండా నిరంతరం ఒక నిత్యకృత్యంలా సాగిపోతూనే ఉండాలి. మంచి ఆహారపు అలవాట్లు, పరిసరాల శుభ్రత, యోగసాధన, దైవచింతన, సత్ప్రవర్తన, ధ్యానం, ఉత్తమాభిరుచులు అన్నీ కలిసివెరసి మానవుని ఆరోగ్యాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంటాయి. అందుకే యోగా అన్నది..మన జీవనవిధానంలో ఒక భాగమైపోవాలి. అదో నిరంతర ప్రక్రియగా ఉండాలి. అప్పుడే యోగాకు పరిపూర్ణమైన సార్థకత!... సర్వే జనాః సుఖినోభవన్తు!..లోకాః సమస్తా..సుఖినోభవన్తు!

(జూన్ 21.. అంతర్జాతీయ యోగా దినోత్సవం)

## ఆ వ్యాఖ్యలు విచారకరం

మేకపాటి రాజమోహన్‌రెడ్డి గారికి రాజకీయ వ్యామోహం తగదని గత వారం 'లాయర్'లో ఒక పాఠకుడు వ్రాయడం విచారకరం. ఏ తండ్రికైనా పుత్రుడు లేడంటే దుఃఖమే. రాజకీయ సాంప్రదాయాలు వేరు, కుటుంబ సాంప్రదాయాలు వేరు. మేకపాటి గౌతంరెడ్డికి సరైన వారసుడు విక్రమ్‌రెడ్డి. ఒక శాసనసభ్యుడు అకాల మరణం పొందినప్పుడు ఆ సీట్ ఎలక్షన్ కమిషన్ ఆరు నెలల్లో ఎన్నికలు జరుపుతుంటే, సంవత్సరం పాటు నేను దుఃఖంలో మునిగి ఉన్నాను, పోటీ చేయను, రాజకీయాలలో దిగను అని ఎవరూ అనరు, అనగూడదు. అంటే ఆ సీటు వేరేవాళ్ళకి పోతుంది.

ఒక ప్రభుత్వోద్యోగి మరణిస్తే మూడు నెలల లోపలే ఆయన కుమారుడు లేదా కుమార్తె కాంపాషనేట్ కారణాల వల్ల తండ్రి స్థానంలో ఉద్యోగమిమ్మంటారు గాని సంవత్సరం పాటు దుఃఖిస్తూ ఉంటాను అని ఎవరైనా అనగలరా?

*భవానీ శంకర్,*
**రిటైర్డ్ ప్రిన్సిపాల్, వి.ఆర్.సి, నెల్లూరు.**

## ఇతరులను దూషిస్తే.. హిందూత్వం బలపడదు

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

దేశంలో తాజాగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంది. మతాలను, కులాలను అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్న పార్టీల పట్ల అసహ్యం కలుగుతోంది. ఇలాంటి పని ఏ పార్టీ చేసినా తప్పే. హిందూత్వం అన్నది భారతీయుల నరనరాల్లో జీర్ణించుకుపోయివుంది. హిందూస్థాన్ అన్న పేరులోనే పవిత్రత క(వి)నిపిస్తుంది. హిందూ మతం చాలా గొప్పది. హిందూ సంప్రదాయాలను, ఆచారాలను కొన్ని వేల సంవత్సరాలనుండి మన దేశం పాటిస్తూ వస్తోంది. ఇప్పుడు కొత్తగా ఎవరినో దూషించినంత మాత్రానో, వేరెవరినో ద్వేషించినంత మాత్రానో హిందూత్వం కొత్తగా బలపడదు. విచక్షణ కోల్పోయి ప్రజల విశ్వాసాలతో ఆడుకోవడం విజ్ఞత కాదు. ఇది ఎవరికైనా మంచిది కాదు.

*ఆర్. విశ్వేశ్వరరావు, హైదరాబాదు.*

## గురువారం 'లాయర్' వారం!

'లాయర్' పత్రికకు 41వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. నెల్లూరుకు దూరంగా ఇతర దేశాలలో ఉంటున్నా నెల్లూరు వార్తలను, విశేషాలను క్రమం తప్పకుండా మాకు అందిస్తుంది 'లాయర్'. ఇటీవలి కాలంలో తన వాణి వినిపించడంలోనూ, బాణీని ప్రదర్శించడంలోనూ సరళి మార్చుకుని, సర్వజనామోదయోగ్యంగా అందరినీ అలరిస్తోంది. ఒక పార్టీకో, లేక వ్యక్తులకో 'లాయర్' కొమ్ము కాయదని రుజువు చేసుకొంటోంది. గురువారం సాయంత్రమైతే మా ఫోన్లలో లాయర్ ప్రత్యక్షమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నెల్లూరీయులెంతమందికో ఇప్పుడు గురువారం 'లాయర్' వారం అయ్యింది. స్థానిక పత్రిక అయినప్పటికీ జాతీయ పత్రికల స్థాయిలో ప్రాచుర్యం పొందుతూ, 42వ ఏట అడుగుపెట్టిన 'లాయర్'కి 'హ్యాట్సాఫ్'.

### రాయుడు గారి విశ్లేషణలు చాలా బాగుంటున్నాయి...!

'మనలోమాట'... అంటూ ప్రతి వారం భోగాది వేంకటరాయుడు గారు అందిస్తున్న విశ్లేషణలు కూడా చాలా బాగుంటున్నాయి. రాజకీయ పార్టీలకు, వాటి అధినేతలకు సూచనలిస్తున్నట్లుగా కనిపిస్తూనే వారి లోటుపాట్లను నిర్మొహమాటంగా ఎత్తిచూపుతున్నారు. ఆయన విశ్లేషణ ఒక్కొక్కసారి సుదీర్ఘంగా ఉన్నా ఎక్కడా బోరు కొట్టకుండా సూటిగా సుత్తిలేకుండా చెప్పడంలో ఆయనకి ఆయనే సాటి. వారి విశ్లేషణలలోని ఛలోక్తులు, వ్యంగ్య విమర్శలు నేతలకు చెంపపెట్టులా అనిపిస్తాయి.

*– వై. కిరణ్‌రెడ్డి, దుబాయ్.*

## నెల్లూరుకే గర్వకారణం విపిఆర్ దానగుణం

ప్రముఖ వదాన్యులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గారు ఇటీవల ప్రగతి చారిటీస్ వారికి 3 లక్షల రూపాయలు విరాళం అందచేసినట్లు 'లాయర్'లో చదివాను. వారు గత 15 సంవత్సరాలుగా ప్రగతి చారిటీస్‌కి ప్రతీ ఏటా 3 లక్షలు అందిస్తున్నారని కూడా చదివి చాలా సంతోషం కలిగింది. డబ్బు చాలామంది దగ్గర ఉంటుంది. కానీ ఆ డబ్బుని సమాజ సేవకోసం వినియోగించే సేవాగుణం అతి కొద్దిమందికే ఉంటుంది. అలాంటి కొద్దిమందిలో కూడా, చాలా అరుదైన వ్యక్తి విపిఆర్ గారు. దాతృత్వంతో జీవితాన్ని ధన్యం చేసుకుంటున్న ధన్యజీవి విపిఆర్ గారు. ప్రభాకరరెడ్డి గారి లాంటి భక్తితత్వ పరాయణులు, సమాజ సేవకులు ఉండబట్టే నీతి, నిజాయతి, న్యాయం, ధర్మం ఇంకా కొంచెమైనా బ్రతికే ఉన్నాయి. నెల్లూరుకే గర్వకారణం వారి దానగుణం. సేవాతత్పరునికి నా అభినందనలు.

*బి. శివరామకృష్ణ, డల్లాస్, యు.ఎస్.ఏ.*

## 'క్రాంతి పథం' సిబ్బంది ఇబ్బందులు తీర్చాలి

వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఐకాస కన్వీనర్ ఎం.కృష్ణయ్య కోరారు. ఇటీవల నెల్లూరులోని డిఆర్‌డిఏ సమావేశమందిరంలో ఆ సంఘం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి పిఆర్‌సి అమలుచేయాలని, ఉద్యోగవిరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కమిటీ ప్రతినిధులుగా టి.శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, రాజు, మధుసూదన్ రావు, జనార్ధన్, శేషారెడ్డి, సుజీవ, లక్ష్మీనరసయ్యలను ఎంపికచేశారు.

## ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు

పొదలకూరులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటిఐ)లో సూయింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, చేరదలచుకున్నవారు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తులు పంపుకోవాలని ఐటిఐ ప్రిన్సిపాల్ బి.మురళి ఒక ప్రకటనలో కోరారు.

## నీటిలో ప్రాణాలు



ఎండాకాలం వస్తే చాలు.. సహజంగానే పిల్లలకు, యువతకు ఈత గుర్తుకొస్తుంటుంది. వేసవి సెలవులప్పుడే కాదు.. సమయం దొరికినప్పుడల్లా పక్కనే ఉన్న కాలువలు, చెరువుల మీద మనసు పడుతుంది. అయితే, ఆ ఉత్సాహమే ఒక్కోసారి ప్రాణాలను కూడా బలితీసుకుంటుండడం బాధాకరం. ఇటీవలికాలంలో జిల్లాలో తరచూ నీటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ నీళ్ళలో దిగకుండా ప్రమాద హెచ్చరికల బోర్డులు పెట్టాలని అంటుంటారే కానీ మన జిల్లా యంత్రాంగానికి అంత తీరిక దొరకడం లేదు. ఈలోగా పలువురు చిన్నారులు, లేదా యువకుల ప్రాణాలు గంగలో కలిసిపోతున్నాయి. ప్రతి గ్రామంలో

### సమస్యల తో 'రణం'

ఒకరికిద్దరు సిబ్బందిని అందుకు కేటాయించి ఈ ప్రమాద సూచికలను పెట్టడం వల్ల కొంతమేరకైనా ప్రయోజనం ఉంటుంది. అంతేకాదు, ముఖ్యంగా తల్లి తండ్రులు తమ బిడ్డలు ఇంట్లోనుంచి బయటకు వెళ్తున్నప్పుడు ఎక్కడికి వెళ్తున్నారో తప్పనిసరిగా ఓ కన్నేసి పెట్టాలి. బావుల వద్దకు, చెరువుల దగ్గరకు పోకుండా చూసుకోవాలి. ఈ విషయంలో తల్లితండ్రులదే ప్రధాన బాధ్యతగా గుర్తుంచుకోవాలి. ఎందుకంటే ఏమాత్రం ఏమరుపాటు జరిగినా.. ఆ తర్వాత ఎంతపెద్దగా రోదించినా ప్రయోజనం ఏముంటుంది?...నెల్లూరు పెన్నానదిలో ఒకప్పట్లో ఎక్కడో ఒకటిరెండు చోట్ల సుడిగుండాలుండాయి అనేవాళ్ళు. ఇప్పుడు ఆ నదంతా గుంటలమయంగా ఉంది. అది తెలియక ఎక్కడంటే అక్కడ మునిగితే ఇక తేలేది శవాలే. అందుకు తగ్గట్టుగా ఇటీవలికాలంలో గ్రావెల్, ఇసుక మాఫియాల వారు నదులు, చెరువుల్లో మట్టో, ఇసుకో దొరికినచోటల్లా తవ్వేస్తుండడంతో నదులు, చెరువుల్లో ఇప్పుడు గుంతలు కాదు పెద్దపెద్ద గోతులు పడుతున్నాయి. చాలాచోట్ల అవిప్పుడు మరింత ప్రమాదకరంగా మారాయి. సరదాగా ఈతకు దిగే చిన్నారులు, యువకులకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి?.. అదేవిధంగా సముద్రాల దగ్గర కూడా జాగ్రత్తగా ఉండాలి. బీచ్‌ల వద్దకు ఉత్సాహంగా వెళ్ళినప్పుడు లోతు లేని ప్రాంతాల్లోనే వారిని అనుమతించే విధంగా అధికారులు, లేదా పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే అలలు లాగేసుకుపోతాయి. ఇటువంటి దుర్ఘటనలు జిల్లాలో కొల్లలు. ఇలా ఎంతోకాలంగా నీటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా.. నీటిలో ప్రాణాలు కలిసిపోతున్నా.. కాకి అరుస్తూనే ఉంటుంది.. కరవాడ ఎండుతూనే ఉంటుందన్నట్లుగా ఉంది మన అధికారుల పరిస్థితి. ఇకనైనా ప్రమాదాలు జరగకుండా.. ఎవరి ప్రాణాలు నీటిలో కలిసిపోకుండా తగు ముందుజాగ్రత్తలు తీసుకుంటారని ఆశిద్దాం!..

*- సంచారి*

# పాటకారి.. మాటకారి మన బాలు

- వెంకయ్యనాయుడు

- ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జీవిత కథ 'జీవన గానం' గ్రంథాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి
- తొలి ప్రతిని అందుకున్న 'పద్మభూషణ్' కమల్‌హాసన్



***'దొరకునా ఇటువంటి సేవ'... అన్నట్లుగా డాక్టర్ పి.ఎస్.గోపాలకృష్ణ విరచిత మన బాలు జీవితకథ 'జీవనగానం' మరియు సంజయ్ కిషోర్ రూపొందించిన 'బాలు జీవన చిత్రం' లఘు చిత్రం ఆవిష్కరణ కార్యక్రమానికి దసపల్లా వేదికైంది.***

సంగీత, సాహిత్య, కళారాధకులు, శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపక ఛైర్మెన్, 'పద్మభూషణ్' డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి సహకారంతో వారి స్వీయ పర్యవేక్షణలో 'హాసం' ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రధాన అతిథిగా పాల్గొన్న ఈ ఆత్మీయ ఆవిష్కరణల సభలో బహుభాషా నటుడు, నిర్మాత, దర్శకుడు 'పద్మభూషణ్' కమల్‌హాసన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. బాలు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం, సంజయ్ కిషోర్ రూపొందించిన బాలు జీవన చిత్రాన్ని సభికుల మధ్యనే కూర్చున్న ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. 55 నిమిషాల నిడివి ఉన్న ఈ లఘు చిత్రాన్ని సమయాభావం కారణంగా 20నిమిషాలకు కుదించి ప్రాంగణంలో ప్రదర్శించారు. వరప్రసాద్ రెడ్డి స్వాగతోపన్యాసంతో సభా కార్యక్రమం ఆరంభమయ్యింది. 'జీవన గానం' గ్రంథాన్ని ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆవిష్కరించి తొలి ప్రతిని కమల్‌హాసన్‌కి అందించారు.

ఈ ఆవిష్కరణ సమయంలో, వరప్రసాద్‌రెడ్డి, రచయిత డాక్టర్ గోపాలకృష్ణతో పాటు బాలు తనయుడు చరణ్, చెల్లెలు శైలజ కూడా వేదికపై ఉన్నారు.



## బాలు గానం జీవనగానం.. సజీవ గానం! - వెంకయ్యనాయుడు

ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ బాలు లేరంటే నమ్మలేకున్నాం. ఆయన గానం జీవన గానం, సజీవ గానం అన్నారు. సంగీత చరిత్రలో బాలు పోషించిన పాత్ర అజరామరంగా, చిరస్మరణీయంగా వర్ధిల్లుతుందన్న విశ్వాసం తనకుందన్నారు. బాలు లేకుండా ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనవలసి రావడం చాలా బాధగా ఉందన్నారు. తన మాతృ భాష సంగీతం అని చెప్పి, ఆచరణలో సైతం చెప్పిన మాటను చేసి చూపించిన గొప్ప మనిషి బాలు అన్నారు. సంస్కారవంతుడు, స్నేహశీలి, మృధుస్వభావి, నిత్య కృషీవలుడు మన బాలు గురించి ముందు తరాలవారే కాకుండా నేటి తరం వారు కూడా ఇంకా లోతుగా తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. కమల్‌హాసన్ సూచించినట్లుగా బాలు జీవిత చరిత్రని వీలయినన్ని ఎక్కువ భాషలలోకి అనువదించాలని అన్నారు. బాలసుబ్రహ్మణ్యం తన పాటతో నాదోపాసన చేసి తెలుగు భాషకు ఖ్యాతి తేవడమే కాకుండా, తన మాటలతో భావితరాలలో సంస్కార బీజాలని నాటాడని అన్నారు. అందుకే తన దృష్టిలో ఆయన తెలుగు పాటకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన పాటకారి, తెలుగు భాషా సంస్కృతులను ముందు తరాలకు చేరవేసిన మాటకారి అని కూడా ప్రశంసించారు. ఆయనకు వృత్తి పట్ల ఉన్న నిబద్ధత, ఆయనలోని వినయం, ఉత్సాహం ఆయనలోని ప్రతిభకు మరింత వన్నె తెచ్చాయని అన్నారు. మనసుపెట్టి పనిచేసే ఆయన గుణం గాయకుడిగానే కాకుండా, నటుడిగా, సంగీత దర్శకుడిగా, బుల్లితెరపై 'పాడుతా తీయగా' వంటి బృహత్తర కార్యక్రమాల రూపకర్తగా ఆయనకు విజయాన్ని, కీర్తిని తెచ్చిపెట్టాయని అన్నారు. బాలు జీవితం భారతీయ సినిమా చరిత్రలో ఒక స్వర్ణ శకం అని అభివర్ణించారు. అమరగాయకులు ఘంటసాల, బాలు ఇద్దరూ తెలుగు సినిమా సంగీతానికి రెండు కళ్ళ లాంటి వారని కీర్తించారు. వీరికి మరణమే లేదన్నారు. సృష్టి ఉన్నంత వరకు వారు జీవించే ఉంటారని అన్నారు. బాలుకి జన్మనిచ్చిన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిని ఈ సందర్భంగా వెంకయ్య గుర్తుచేసుకున్నారు. బాలు 'జీవనగానం' గ్రంథకర్త గోపాలకృష్ణని, గ్రంథ ప్రచురణకర్త తన చిరకాల మిత్రులు వరప్రసాద్‌రెడ్డిని, బాలుపై ప్రేమతో కార్యక్రమానికి విచ్చేసి తొలి ప్రతిని అందుకున్న కమల్‌హాసన్‌ని ఉపరాష్ట్రపతి అభినందించారు.

ప్రముఖ న్యూస్ యాంకర్, ప్రతిభాశాలి, 'తుంగా అవార్డు' గ్రహీత స్వప్నసుందరి తనదైన శైలిలో నిర్వహించిన ఈ అపురూప, ఆత్మీయ కార్యక్రమంలో బాలు సతీమణి సావిత్రమ్మతో పాటు అనేకమంది సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు పాల్గొని మన బాలుని స్మరించుకున్నారు. వచ్చిన అతిథులందరిని వరప్రసాద్‌రెడ్డితో పాటు వారి శ్రీమతి వసంత ఆప్యాయంగా పలకరించి ఆహ్వానించారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులతో పాటు, తనకు సహకరించినవారందరినీ ఇదే వేదికపై వరప్రసాద్‌రెడ్డి సముచిత రీతిలో సత్కరించారు.

మన నెల్లూరు బాలుడి జీవిత కథ ప్రచురణ బాధ్యతలు, మన మరో నెల్లూరీయులు వరప్రసాద్‌రెడ్డి స్వీకరిస్తే, ఆ కథను ఆవిష్కరించింది కూడా మన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు కావడం ఈ కార్యక్రమానికి పరిపూర్ణతను చేకూర్చింది.



## బాలు మాటల్లో మాధుర్యం, మృదుత్వం, మమకారం ఉంటాయి

- 'పద్మభూషణ్' వరప్రసాద్‌రెడ్డి



బాలుని నేను పెద్దబ్బయ్యా అని పిలుచుకునేవాడిని, ఆయన నన్ను చిన్నబ్బయ్యా అని సంబోధించేవారు, బాలు జీవిత కథ 'జీవనగానం' ప్రచురించే భాగ్యం నాకు కలగడం నా అదృష్టం అని అన్నారు 'పద్మభూషణ్' వరప్రసాద్‌రెడ్డి. బాలు పాటలతో పాటు ఆయన మాటలంటే తనకు ఇంకా ఎక్కువ ఇష్టమని అన్నారు. బాలుని అమితంగా ఇష్టపడే వెంకయ్యనాయుడు గారు, బాలు ఇష్టంగా ప్రేమించే కమల్‌హాసన్, బాలు మిత్రుడు 'జీవనగానం' రచయిత గోపాలకృష్ణ తనతో పాటు ఈ వేదికపై ఉండడం ఈ కార్యక్రమానికి నిండుతనం వచ్చిందని వరప్రసాద్‌రెడ్డి అన్నారు. బాలు బ్రతికి ఉన్నప్పుడే ఈ పుస్తకానికి తన మిత్రుడైన రచయిత చేత శ్రీకారం చుట్టించారని అన్నారు. తాను అడిగిన వెంటనే సంజయ్‌కిషోర్ బాలు జీవన చిత్రాన్ని మనసుతో రూపొందించారని, ఆ లఘు చిత్రం పూర్తి నిడివి చూడాలనుకుంటే శాంత వసంత ట్రస్ట్ వెబ్‌సైట్‌లో చూడొచ్చని చెప్పారు. కార్యక్రమానికి వచ్చిన ప్రతిఒక్కరికీ వరప్రసాద్ రెడ్డి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## నేను - అన్నయ్య... మా ఇద్దరి శరీరాలు వేరైనా ఆత్మ ఒక్కటే

- 'పద్మభూషణ్' కమల్‌హాసన్



బాలు గారు, నేను వేరైనా మా ఇద్దరి ఆత్మ ఒక్కటే అన్నారు కమల్‌హాసన్. బాలు అన్నయ్య పుట్టింది నెల్లూరే అయినా ఆయన భారతీయ నిధి అని చెప్పారు. 30 వేల పాటలు పూర్తైనప్పుడు ఇలాంటి కార్యక్రమం ఒకటి చేద్దాం అని తాను అడిగితే 'ఆలా కార్యక్రమం చేసుకుంటే వేరొకరి రికార్డుని మనం దాటాం అని బహిరంగంగా చెప్పుకున్నట్లవుతుంది... అది తప్పు, వద్దయ్యా లెక్కలే కదా' అని అన్నారని, అన్నయ్యలోని వినయ విధేయతలకి ఇంతకంటే ఉదాహరణ అవసరం లేదని కమల్ చెప్పారు. బాలు గారి దగ్గర నుండి మానవత్వం, మనిషితత్వం తాను నేర్చుకున్నానని అన్నారు. ఎప్పుడూ ఒదిగి ఉండాలని మా అమ్మానాన్న చెప్పేవారు, కానీ అలా ఉండడం నేను బాలుగారిలో చూసి నేర్చుకున్నానని సగర్వంగా చెప్పుకుంటానని అన్నారు కమల్‌హాసన్. తాను ఈ కార్యక్రమానికి రాకపోతే చాలా కోల్పోయి ఉండేవాడినని అన్నారు. తనను ఆహ్వానించినందుకు వరప్రసాద్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అన్నయ్య కథను ఆంగ్లంలో అనువదించి ముద్రించాలని కోరారు. తాను ఏ దేశానికి వెళ్లినా అన్నయ్య పుస్తకాన్ని చూపించి ఈయన నా మిత్రుడు, నాకు తన గాత్రాన్ని ఇచ్చిన మహానుభావుడు అని గర్వంగా చెప్పుకుంటానని అన్నారు.

## కొండంత ప్రతిభను చిన్న అద్దంలో చూపించే ప్రయత్నమే 'జీవనగానం'

-డాక్టర్ గోపాలకృష్ణ



సాటిలేని మేటి కళాకారుడిగా వెలుగులు చిమ్మిన మహోన్నతమూర్తి బాలసుబ్రహ్మణ్యం అని గ్రంథ రచయిత డాక్టర్. పి.ఎస్.గోపాలకృష్ణ అన్నారు. కొండంత ఆ అద్వితీయ వ్యక్తి జీవితాన్ని వారి ప్రతిభలోని గరిమను ఒక చిన్న అద్దంలో చూపించే ప్రయత్నమే 'జీవనగానం' అని చెప్పారు. ఇది తాను రాయలేదని, బాలు గారే తనచేత రాయించారని చెప్పారు. అయిదు దశాబ్దాలకుపైగా బాలుతో తనకున్న స్నేహ సాంగత్యాన్ని ఈ సందర్భంగా గోపాలకృష్ణ గుర్తు చేసుకున్నారు. జీవనగానం ప్రచురణ బాధ్యతను తన భుజస్కందాలపైకెత్తుకున్న వదాన్యులు, బాలు గారికి అత్యంత ఆప్తులు వరప్రసాద్‌రెడ్డి గారికి ఈ సందర్భంగా తన కృతజ్ఞతలను తెలియజేశారు.

# కిషోర్స్ రత్నం విద్యార్థులందరూ పాసయ్యారు



నెల్లూరులోని కిషోర్స్ రత్నం విద్యాసంస్థల విద్యార్థులు టెన్త్‌లో తమ సత్తా చాటుకున్నారు. పదో తరగతి పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణులై ఆ విద్యాసంస్థలకు మరింత ప్రతిష్ఠను చేకూర్చారు. వారిలో అత్యధికమార్కులు సాధించిన ప్రజ్ఞశ్రీని, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరినీ ఆ విద్యాసంస్థల అధినేతలు కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు తమ అభినందనలు తెలిపారు. సరస్వతినగర్‌లోని పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజయ్ సింగ్, ప్రిన్సిపల్ మణిమాల పాల్గొని విద్యార్థులందరినీ అభినందించారు.

# ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

• పిఆర్‌సి నష్టాలపై కార్మికుల నిరసన




రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పిఆర్‌సి ద్వారా ఆర్టీసి ఉద్యోగులకు కలుగుతున్న నష్టాలను వెంటనే పరిశీలించి వాటిని సరిచేయాలంటూ నెల్లూరులోని ఆర్టీసి ఐక్యవేదిక నాయకులు, కార్మికులు ఈనెల 13న ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నెల్లూరులోని ప్రధాన ఆర్టీసి బస్టాండ్ ప్రాంగణంలోని 1,2 డిపోల ఎదుట జరిగిన ఈ ఆందోళనల్లో ఆర్టీసి ఐక్యవేదిక నాయకుడు బాబూసామ్యేల్ మాట్లాడుతూ పిఆర్‌సి అమలులో ఆర్టీసి ఉద్యోగులకు నష్టాలు లేకుండా చూడాలన్నారు. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసే నాటికి పెండింగ్‌లో ఉన్న డిఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులకు ఇతర ప్రాంతాలకు బదిలీ చేసే సందర్భంలో వారి సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఐక్యవేదిక నాయకులు కట్టా సుబ్రహ్మణ్యం, పి. సుబ్రహ్మణ్యం, నాగేంద్ర, రీజియన్ నాయకులు ఓవి ప్రసాద్, వి.ప్రసాద్, జానా వెంకటేశ్వర్లు, టిఎంఎం రెడ్డి, కృష్ణారావు, రాజశేఖర్‌లతో పాటు డిపో నాయకులు మాల్యాద్రి, కెకె మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**క్రీడల్లో సత్తాచాటిన..**

# నెల్లూరు విద్యుత్ సర్కిల్

➢ పురుషుల జట్టుకు.. ఓవరాల్ ఛాంపియన్‌షిప్

➢ కబడ్డీ, టెన్నిస్‌లలో రాణించిన మహిళల జట్టు



ఎస్‌ఇ విజయకుమార్‌రెడ్డికి ట్రోఫీని అందజేస్తున్న క్రీడాకారులు
మహిళా క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్‌ఇ

ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల క్రీడల్లో నెల్లూరుజిల్లా విద్యుత్ సర్కిల్ నుంచి పాల్గొన్న క్రీడాకారులు తమ సత్తా చాటుకున్నారు. పురుషుల జట్టు అన్ని విభాగాల క్రీడాంశాల్లో ఉత్తమ ఆటతీరుతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని సాధించి అందరి అభినందనలు అందుకోగా, ఇంటర్ సర్కిల్ కబడ్డీ, టెన్నిస్‌లలో అత్యుత్తమ ప్రతిభతో రాణించిన మహిళాక్రీడాకారులు వారు గెలుచుకున్న ట్రోఫీలను విద్యుత్ శాఖ ఎస్‌ఇ, జిల్లా స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డికి అందజేశారు. తమ ఉద్యోగులు క్రీడల్లో అగ్రగామిగా నిలుస్తుండడం తమకెంతో గర్వకారణమని ఆయన అన్నారు. విజేతలైన క్రీడాకారులను ఈనెల 13న నెల్లూరులోని విద్యుత్ భవన్ సర్కిల్ కార్యాలయంలో ఆయన అభినందించారు. జిల్లా స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ సోమశేఖర్ రెడ్డి, విద్యుత్ ఇంజనీర్లు శ్రీధర్ రెడ్డి, బాలచంద్ర, విజయ కుమార్‌రెడ్డి, విజిలెన్స్ సిఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.




## నెల్లూరు కబుర్లు



రాష్ట్రంలోనే నంబర్-1..

# నెల్లూరు రెడ్‌క్రాస్

**స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ చేతుల మీదుగా 'బెస్ట్ పర్‌ఫార్మన్స్' అవార్డు**

తన విశిష్టమైన సేవలతో నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్రంలోనే నంబర్-1 స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా శాఖల్లో రెడ్‌క్రాస్ రక్తనిధి (బ్లడ్‌బ్యాంక్)కి ప్రథమ స్థానం లభించింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈనెల 14వ తేది రాత్రి విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు చేతులమీదుగా నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితర ప్రతినిధులు ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డును అందుకోవడం విశేషం. అన్ని సేవా కార్యక్రమాల్లో, వివిధ ప్రాజెక్టుల ద్వారా విశేష సేవలందిస్తూ నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ ముందుంటోందని, నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్‌ను అన్నిజిల్లాల వారు ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింతగా సేవచేయాలని ఈ సందర్భంగా కృష్ణబాబు చెప్పారు. ఇదే సందర్భంలో రాష్ట్రంలోని బెస్ట్ సబ్ బ్రాంచ్ బ్లడ్‌బ్యాంకుల్లో నెల్లూరుజిల్లా కావలి రెడ్‌క్రాస్ బ్రాంచ్‌కి ప్రథమస్థానం లభించడంతో ఆ అవార్డును కావలి రెడ్‌క్రాస్ ఛైర్మెన్ రవిప్రకాష్, డాక్టర్ బి.రవికుమార్, డాక్టర్ రమ్యలకు అందజేశారు. జిల్లా రెడ్‌క్రాస్‌కు ఇలాంటి ఉత్తమ అవార్డులు రావడం తనకెంతో సంతోషంగా ఉందని చంద్రశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్‌క్రాస్ ఛైర్మెన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఏకె ఫరీదా తదితరులు పాల్గొని నెల్లూరు రెడ్‌క్రాస్ సేవలను కొనియాడారు.

# కన్నులపండువగా.. శ్రీ సాయిసత్య వ్రతం



ఏరువాక పున్నమి సందర్భంగా ఈనెల 14వ తేది రాత్రి నెల్లూరు బాలాజీనగర్ శివార్లలోని పద్మావతినగర్‌లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో శ్రీ సాయిసత్య వ్రతాన్ని కన్నులపండువగా నిర్వహించారు. 108 మంది భక్తులతో సామూహికంగా ఈ వేడుక జరిగింది. సాయి దర్బార్ ప్రధాన అర్చకులు నాగార్జునశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తొలుత మందిరంలో కొలువైవున్న శ్రీ షిర్డీసాయినాథునికి విశేషాలంకారం చేసి విశిష్ట పూజలు చేశారు. మందిరం ఛైర్మెన్ మధుసాయి వ్రతకథలను పారాయణం చేశారు. వ్రతంలో పాల్గొన్నవారికి బాబా చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరిగింది.

# మాగుంట లేఅవుట్‌లో.. దొంగలుపడ్డారు

ఇంటికి తాళం వేసి వెళ్తే చాలు..దొంగలు తమ ప్రతాపం చూపించేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇటీవల జరుగుతున్న ఈ బాపతు దొంగతనాలు ఇప్పుడు నగరంలో కూడా ప్రవేశించాయి. ఈనెల 12వ తేది రాత్రి నగరంలోని మాగుంట లేఅవుట్‌లో కూడా దొంగలుపడ్డారు. అక్కడొక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న రవీంద్రరెడ్డి ఇటీవల కుటుంబంతో కలిసి బెంగుళూరుకు వెళ్లారు. ఇదే సందనుకుని దొంగలు ఆ ఇంటి తలుపులు పగలగొట్టి అల్మారాలోని నాలుగు సవర్ల బంగారు నగలను, వాచ్‌ను దొంగిలించుకుపోయారు. రవీంద్రరెడ్డి వచ్చి చూసుకుని జరిగిన చోరీ గురించి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదుచేశారు.



# రోడ్డుప్రమాదాలు జరగకుండా చూడండి

**- పోలీసులకు డిఐజి త్రివిక్రమవర్మ సూచనలు**

రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసు అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని గుంటూరు రేంజ్ డిఐజి డా. త్రివిక్రమవర్మ జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. ఈనెల 12న ఆయన నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన నేరసమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో నేరాలు తగ్గుముఖం పడుతున్నాయని, అయినప్పటికీ పూర్తిస్థాయిలో నేరాలను కట్టడిచేసేందుకు పోలీసులు మరెంతగానో కృషిచేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీ కేసుల్లోనూ, ఫోక్సో కేసుల్లోనూ దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. అదృశ్యమైన బాలబాలికలు, మహిళల ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలన్నారు. పాత నేరస్తులపై పోలీసులు నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ విజయారావు, ఏఎస్పీలు, డిఎస్పీలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రక్తదానంతో ప్రాణదానం

**--- ప్రముఖ సినీనటుడు భానుచందర్ ---**




రక్తదాన మోటివేటర్లకు పతకాలను అందజేస్తున్న సినీనటుడు భానుచందర్ తదితరులు

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి పేదరోగులను ఆదుకోవాలని ప్రముఖ సినీనటుడు భానుచందర్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈనెల 11న నెల్లూరులోని ఏసుగు సుందరరామిరెడ్డి భవన్‌లో నోవా బ్లడ్‌బ్యాంక్, శివాజీ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన రక్తదాన మోటివేటర్ల పతకాలను అందజేసి అభినందించారు. జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ డైరెక్టర్ జలదంకి సుధాకర్, గణేశ్ సేవా మిత్రమండలి, అధ్యక్షుడు గాలి శ్రీధర్, పవర్ యూత్ స్వచ్ఛంధసంస్థ వ్యవస్థాపకులు రమేష్‌రాజుతో పాటు 88 మందికి ఉత్తమ మోటివేటర్‌లుగా అవార్డులను అందజేశారు. రక్తదాన మోటివేటర్‌గా విశేష సేవలందిస్తున్న భాస్కర్‌నాయుడుకు అందరూ అభినందనలు తెలియజేశారు. ఏపి జెన్కో డిఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా యూత్ ఆఫీసర్ మహేంద్రరెడ్డి, సెట్నెల్ సిఇఓ పుల్లయ్య, మెడికవర్ ఆసుపత్రి గణేష్ నాగిరెడ్డి, సుధీర్, అమ్మా యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్‌బాబు,లక్ష్మీ సామ్రాజ్యం, శ్రీధర్, వెంకురెడ్డి, నిర్వాహకులు వెంకట కిషోర్, నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అండగా ఉంటా.. ఆదుకుంటా

**రైల్వేలైన్ నిర్వాసితులకు కోటంరెడ్డి శీనయ్య అభయం**



ఆందోళన పడకండి. మీకందరికీ నేను అండగా ఉంటా.. ఆదుకుంటానంటూ టిడిపి నగర ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రైల్వేలైన్ నిర్వాసితులకు అభయమిచ్చారు. ఈనెల 14న ఆయన నెల్లూరులోని రంగనాయకులపేట రైల్వేలైన్‌లోని నిర్వాసితులతో మాట్లాడారు. ఎంతోకాలం నుంచి అక్కడున్న ఇళ్ళను ఖాళీచేయాలని రైల్వే అధికారులు చెప్పడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయంగా ఇళ్ళను చూపిన తర్వాతనే ఖాళీచేయించాలని ఆయన కోరారు. ఈ విషయంలో ప్రజలకు తాను పూర్తిస్థాయిలో సహకరిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఆమేరకు ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇక్బాల్, రియాజ్, పిట్టి సత్యనారాయణ, కప్పిర శ్రీనివాసులు, నౌషాద్, మామిడాల మధు, ప్రశాంత్, కువ్వారపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



## వెంకయ్యను కలసిన.. మస్తానయ్య

భారత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మెన్.. మన నెల్లూరీయులు ముప్పవరపు వెంకయ్యనాయుడును రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన మరో నెల్లూరీయుడు బీద మస్తాన్‌రావు ఇటీవల హైదరాబాద్‌లో గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మస్తానయ్యకి ఉప రాష్ట్రపతి శుభాకాంక్షలు తెలిపారు.



## టిటిడిలోని వివిధ ట్రస్టులకు.. 3.20 కోట్ల విరాళం

### ఆర్‌ఎస్ బ్రదర్స్, హానర్ హోమ్స్ యాజమాన్యాల దాతృత్వం

తిరుమల తిరుపతి దేవస్థానాల వారు నిర్వహిస్తున్న పలు సంస్థలకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు పలువురు ఈనెల 12న 3కోట్లా 20లక్షల రూపాయలు విరాళాలిచ్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆర్‌ఎస్ బ్రదర్స్ గ్రూప్ అధినేతలు పి.వెంకటేశ్వర్లు, టి.ప్రసాదరావు, ఎస్.రాజమౌళిలు ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు కోటి రూపాయలు, బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని ట్రస్ట్‌కు కోటీ 20లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు 60లక్షల రూపాయలు విరాళమిచ్చారు. అదేవిధంగా హానర్ హోమ్స్ సంస్థ యాజమాన్యం బాలచంద్ర, స్వప్నకుమార్‌లు ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కు 40లక్షల రూపాయల విరాళం అందించారు. తిరుమలలోని శ్రీవారి ఆలయంలో ఉన్న శ్రీ రంగనాయకుల మండపంలో టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డికి విరాళాల డీడీలను అందజేశారు.

## ఆదాలకు కృతజ్ఞతలు తెలిపిన టెలికాం సభ్యులు



తమను బిఎస్‌ఎన్‌ఎల్ అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా నియమించేందుకు కృషి చేసిన నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఈ నెల 12న ఆయన క్యాంప్ కార్యాలయంలో కృతజ్ఞతాపూర్వకంగా సన్మానిస్తున్న కెఎల్ నరసింహారావు, శ్రీనివాసులురెడ్డి, ఇక్బాల్, నవీన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి

## మోటార్లకు మీటర్లు.. రైతులకు ఉరితాళ్ళే

### 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'రైతు పోరు' - మాజీమంత్రి సోమిరెడ్డి

వ్యవసాయానికి కేటాయించిన బడ్జెట్‌లో కనీసం మూడోవంతు కూడా ఖర్చుచేయకుండా రైతులకు రాష్ట్రప్రభుత్వం అన్యాయం చేస్తోందని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడమంటే రైతుల మెడలకు ఉరితాళ్ళు తగిలించినట్లేనని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో జరిగిన సర్వేపల్లి నియోజకవర్గ క్లస్టర్ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ళలో పెద్దఎత్తున అక్రమాలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ అక్రమాల వల్ల జిల్లాలో రైతులు గత మూడేళ్ళుగా వేలాది కోట్ల రూపాయలు నష్టపోతున్నారని తెలిపారు. రైతులు కన్నెర్రజేస్తే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయన్న వైకాపా నేతలు గ్రహించాలన్నారు. మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టడాన్ని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20వతేది నుంచి 'రైతుపోరు' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో దౌర్జన్యాలు, మానభంగాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో చేజర్ల



వెంకటేశ్వర్లురెడ్డి, నగర నాయకుడు కోటం రెడ్డి శ్రీనివాసులురెడ్డి, టిడిపి తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకున్న.. ఎమ్మెల్యే ప్రసన్న



ఇటీవల కోవూరు ఆసుపత్రిరోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో చనిపోయిన కోవూరు మండలం పెళ్ళకూరు కాలనీకి చెందిన షేక్ షాబాషా కుటుంబానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూతనందిస్తూ వారికి 50వేల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు. కుటుంబపెద్ద చనిపోవడంతో భార్య, కుమార్తె అనారోగ్యంతో బాధపడుతున్నారన్న సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ప్రసన్న మానవతా హృదయంతో తమ తండ్రి దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ కుటుంబసభ్యులకు సాయం అందజేశారు. ఇటీవల నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో వారికి ఆ మొత్తాన్ని అందించారు. డిఏఏబి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు మండల వైకాపా కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, జడ్పీటిసి కవరగిరి శ్రీలత, ఎంపిపి పార్వతి, ఉపసర్పంచ్ మైనుద్దీన్, అత్తిపల్లి అనూప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వెంకన్నపాళెంలో నేత్రపర్వంగా..

## శ్రీ నీలకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు





తోటపల్లిగూడూరు మండలంలో కొలువైవున్న త్రిపురసుందరీ సమేత శ్రీ నీలకంఠేశ్వరాలయంలో ఈనెల 11 నుంచి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఎంతో పురాతనమైన ఈ శివాలయాన్ని ఇటీవలే పునరుద్ధరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త మూలం సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో, రావూరు సుధీర్‌రెడ్డి పర్యవేక్షణలో, గ్రామస్తుల సహాయ సహకారాలతోఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 14న నందిసేవ, 15వ తేది కల్యాణోత్సవం కనువిందుగా జరిగాయి. ఈనెల 17వ తేది దాకా జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో ఈ నిత్యం పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని తరిస్తున్నారు.

## నిధులు కేంద్రానివి.. పథకాలు వైకాపావి

### ఇది స్టిక్కర్ల ప్రభుత్వం - బిజెపి అధ్యక్షుడు సోము విమర్శలు

కేంద్రప్రభుత్వం కోట్లాది రూపాయలు వ్యయం చేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, ఆ పథకాలను వైకాపా ప్రభుత్వం స్టిక్కర్లు మార్చి తమవిగా చెప్పుకుంటోందని, ఇది స్టిక్కర్ల ప్రభుత్వమని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు ఎద్దేవా చేశారు ఆత్మకూరు ఉప ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఆయన ఆత్మకూరులోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల రైతులకు పంపిణీ చేసిన ట్రాక్టర్లు సైతం కేంద్రం నిధులతో మంజూరైన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పెట్రోలు, డీజల్, గ్యాస్ ధరలను కేంద్రం తగ్గించినా వైకాపా ప్రభుత్వం సెస్ చార్జీలు తగ్గించకపోవడంతో మన రాష్ట్రంలో మాత్రం ధరలు తగ్గడంలేదన్నారు. నడికుడి నుంచి శ్రీకాళహస్తి దాకా రైల్వేలైను నిర్మాణానికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం తన వాటా భూసేకరణ వేగవంతం చేయకపోవడం వల్ల ఆ పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. పంచాయతీల అభివృద్ధికి



మంజూరైన నిధులను దారిమళ్ళించిన ఘనత వైకాపాకే దక్కిందని విమర్శించారు. తొలుత ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు బిజెపి అభ్యర్థి భరత్‌కుమార్, రాష్ట్ర బిజెపి నాయకులు ఎస్ సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి కుడుమల సుధాకర్‌రెడ్డి, కాలం బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# దేశంలో ఎక్కడా లేనన్ని పథకాలు.. మన రాష్ట్రంలోనే

**- పర్యాటక మంత్రి రోజా**



దేశంలో మరెక్కడా లేనన్ని ప్రజా సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలోనే ఉన్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజలందరికి సంక్షేమం, అభివృద్ధి పథకాలు అందుతున్నాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా ఎక్కడా ఇలాంటి పథకాలు లేవన్నారు. ఆత్మకూరు ఉప ఎన్నికల నేపథ్యంలో ఆమె ఇటీవల ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. పెల్లేరు గ్రామంలో రోడ్‌షోలో ఆమె మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను ఈ మూడేళ్ళలోనే 95 శాతం దాకా నెరవేర్చిన ఘనత ఒక్క సిఎం జగన్‌దేనన్నారు. రాష్ట్ర ప్రజలకు కోట్లాదిరూపాయల సంక్షేమపథకాలను, రాష్ట్రం అభివృద్ధికి మరెన్నో కార్యక్రమాలను అమలుచేస్తున్న ముఖ్యమంత్రి సారథ్యంలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా అధికార ప్రతినిధి రామమనోహర్‌రెడ్డి. చేజర్ల జడ్పీటీసి పీర్ల పార్థసారథి, వైకాపా చేజర్ల మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, సిరాజుద్దీన్, పి.వీరరాఘవరెడ్డి, తాజుద్దీన్, అన్నలూరు శ్రీనివాసులునాయుడు, పి.రామమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# 21 నుంచి.. మానసాదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు



వరికుంటపాడు మండలం తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో కొలువైవున్న శ్రీ మానసాదేవి అమ్మవారి ఆలయంలో జూన్ 21 నుంచి మూడురోజుల పాటు వైభవోపేతంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 24న గణపతి పూజతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 25న చండీహోమం, శ్రీ మానసాదేవి శ్రీసూక్త, సర్వసూక్త తాళ హోమాలు, గ్రామోత్సవం, 26న వల్మీకపూజ, సహస్ర నామార్చన, కుంకుమపూజలతో పాటు ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారి బ్రహ్మోత్సవాలకు తరలిరావాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.



# ఎన్‌బికెఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సివిల్ విభాగానికి సంబంధించి ఆఖరు సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు హెచ్‌పిఆర్ సినర్జీ అనే కంపెనీ ఇటీవల ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఆ కంపెనీ ఎం.డి సుకుమార్ ఈ ఎంపికలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 56 మంది విద్యార్థులు హాజరు కాగా వీరికి ముందు రాతపరీక్ష, తరువాత ఇంటర్వ్యూలు చేయగా 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి ఆ విద్యార్థులను అభినందించారు. తమ కళాశాలలో సివిల్ విభాగానికి సంబంధించి ఇప్పటిదాకా 70 మంది విద్యార్థులు పెద్దపెద్ద కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్. కిషోర్, సివిల్ విభాగం కోఆర్డినేటర్ ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# లక్ష్మీనృసింహుని సేవలో కలెక్టర్



జ్ఞానశ్లోకాలను పఠిస్తున్న కలెక్టర్ తనయులు

జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు తన కుటుంబసభ్యులతో కలసి ఇటీవల పెంచలకోనలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమారులు స్వామివారి నిత్యకల్యాణ మండపంలో శ్రీ నరసింహస్వామి జ్ఞానశ్లోకాలను పఠించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులను ఆలయ అర్చకులు, ఇఓ వెంకటసుబ్బయ్య సాదరంగా స్వాగతించారు. వేకువనే స్వామివారికి జరిగే అభిషేక సేవలో కలెక్టర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత ఆలయ అర్చకుల వేదాశీర్వచనం అందుకున్నారు.

## కామాక్షితాయి అమ్మవారికి..

# బంగారు ముక్కెర

జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారికి పాత వెల్లంటి గ్రామానికి చెందిన భక్తులు సిద్దవరపు సురేఖ, కుటుంబసభ్యులు ఇటీవల బంగారు ముక్కెరను అమ్మవారికి సమర్పించుకున్నారు. ఆలయ ఛైర్మన్‌కు ముక్కెరను అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అమ్మవారి ఆలయంలో దర్శనం కల్పించి ప్రత్యేకపూజలు చేయించారు.

# ఎన్‌బికెఆర్ విద్యార్థిని ప్రతిభ



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో రెండవ సంవత్సరం చదువుతున్న కె.లక్ష్మీ సాయి వందన ఈనెల 1 నుంచి 10వ తేది దాకా గుంటూరులో జరిగిన 'ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్' స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ ఎంపికల్లో బంగారు పతకాన్ని సాధించి తదుపరి క్యాంప్‌కు ఎంపికైనట్లు నావల్ ఎన్‌సిసి విభాగం అధికారి డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సాయివందనను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, సిఎస్‌సి విభాగాధిపతి డాక్టర్ ఏ.రాజశేఖర్‌రెడ్డి అభినందించారు. తమ కళాశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ సమాజానికి ఉపయోగపడే రీతిలో సేవలందిస్తున్నందుకు సంతోషంగా ఉందని వారన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# మహిళల రక్షణకు అనేక చర్యలు

**- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు లక్ష్మీరెడ్డి**



గూడూరు పట్టణ సమీపంలోని లెమన్ మార్కెట్ వద్ద ఇటీవల మద్యానికి బానిసైన శేఖర్ తన భార్య వెంకటలక్ష్మిని విచక్షణా రహితంగా కత్తితో దాడి చేసి హతమార్చిన విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు లక్ష్మీ రెడ్డి, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వెంకటలక్ష్మి మృతదేహాన్ని పరిశీలించి, ఘటన వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ ఈ కేసుపై జిల్లా ఎస్పీతో కూడా మాట్లాడటం జరిగిందని, నిందితుడికి కఠిన శిక్ష విధిస్తే ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంరక్షణకు అనేక చర్యలు తీసుకుంటున్నారని, దిశ యాప్ ప్రతి ఒక్క మహిళ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లక్ష్మీరెడ్డి వెంట సిఐ నాగేశ్వరమ్మ ఉన్నారు.

# సమస్యలను వెంటనే పరిష్కరించండి

**- ఆర్డీఓ మురళీకృష్ణ**

గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 13న ఆర్డీఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురాగా, ఆర్డీఓ మురళీకృష్ణ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కాగా, బూదనం గ్రామానికి చెందిన కలిచేటి జయమ్మ తమ నివేశ పట్టాలను కొంతమంది ఫోర్జరీచేసి ఆక్రమించేందుకు చూస్తున్నారని అనేకసార్లు అధికారుల చుట్టూ తిరిగి తెలియజేసినా సమస్య పరిష్కారం కావడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

# విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలి



విశ్వబ్రాహ్మణులు కలసి కట్టుగా పనిచేసి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆ సంఘం నాయకుడు వెంకటశేషయ్య పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సమీక్షా సమావేశాన్ని ఇటీవల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలు, కార్పొరేషన్ నిధులు, రుణాలు వచ్చేలా పోరాడి, ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని చెప్పారు. సురేష్, సదాశివ, శివప్రసాద్, రఘురామయ్య, రఘునాథ, మహేశ్వరి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆ జీవోలను రద్దు చేయండి



ఆర్టీసీ డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సి 113, 114 జీవోలను వెంటనే రద్దు చేయాలని ఆర్టీసీ ఐకాస సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో ప్రాంగణం వద్ద ఐకాస ఆధ్వర్యంలో 13వ తేదీ భోజన విరామ సమయంలో నిరసన, ధర్నా నిర్వహించారు. బదలీలను రద్దు చేయాలనీ, గతంలోని అలివెన్స్‌లను కొనసాగించాలని, ఐకాస 45 డిమాండ్లను పరిష్కరించాలని, క్యాడర్‌ను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. అహ్మద్, శ్రీనివాసులు, ప్రవీణ్, మీరయ్య, నారాయణ పాల్గొన్నారు.



# అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ

గూడూరు పట్టణ సమీపంలోని జాతీయ రహదారి కూడలి వద్ద పోటుపాలెం ప్రాంతంలో అయ్యప్పస్వామి దేవస్థానం నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని శ్రీ అయ్యప్పస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన నిర్వహించారు. వేదపండితులు సంప్రదాయబద్ధంగా కార్యక్రమం చేపట్టారు. ఆంధ్ర మహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ చెరుకూరు రోహిణి ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

# ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు నాగిశెట్టి ధర్మయ్య

ఎస్సీ, ఎస్టీలపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని, కట్టడి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ చూపాలని ఏపి షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగిశెట్టి ధర్మయ్య అన్నారు. ఈ నెల 12వ తేదీ కడప, బాలాజీనగర్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో సంఘ ఆవిర్భావ దినోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రవికుమార్, సి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ

## విశ్రాంత హైకోర్టు జస్టిస్ చంద్రు కృష్ణస్వామి



పుస్తకాల్లో చదువుకున్న భారత రాజ్యాంగం ఆచరణకు నోచుకోవడం లేదని, స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ళ తర్వాత కూడా మనం రాజ్యాంగం-ప్రాథమిక హక్కులు గురించి మాట్లాడుకోవాల్సిరావడం విచారకరమని చెన్నైకి చెందిన విశ్రాంత హైకోర్టు జస్టిస్ చంద్రు కృష్ణస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 12న డాక్టర్ జి.విజయకుమార్ 7వ వర్థంతి సందర్భంగా నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని 'భారత రాజ్యాంగం-ప్రాథమిక హక్కులు' (మతస్వేచ్ఛ-జీవించే హక్కు) అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని విమర్శించారు. దేశాన్ని పాలించే ప్రభుత్వం అదాని, అంబానీల కోసమా? ప్రజల కోసమా?..అని ప్రశ్నించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం దేశంలో ఎవరికి నచ్చిన మతాన్ని వారు అంగీకరించవచ్చన్నారు. కొంతమంది తమ స్వార్థం కోసం ప్రజలను మతం, కులం, ప్రాంతాల వారీగా వేరుచేసే యత్నాలు చేయడం తగదన్నారు. అయితే భారత్ ప్రజలు ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొన్నారని, ప్రజలంతా ఐక్యంగానే ఉంటారని, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతారని, వారిని ఏ శక్తులూ విడదీయలేవని అన్నారు. చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించి తీరాలని, లేకుంటే దేశంలో అశాంతి తప్పదని చెప్పారు. కులమతాలకు అతీతంగా అందరూ లౌకికవాదాన్ని ముందుకు తీసుకువెళ్ళాలన్నారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో ముస్లిం దేశాలకు క్షమాపణలు చెప్పాల్సింది భారత్ కాదని, ప్రధాని మోడీ సారధ్యంలోని బిజెపి ప్రభుత్వమని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన విక్రమసింహపురి యూనివర్శిటీ రిజిస్ట్రార్ డా. ఎల్ విజయకృష్ణారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ జి.విజయకుమార్ ప్రజావైద్యునిగా, సైన్స్ ప్రచారోద్యమ సారథిగా, వామపక్షభావాలు కలిగిన నాయకునిగా పేరొందారని కొనియాడారు. డాక్టర్ జి.విజయ కుమార్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి శేషారెడ్డి, ఎం.డి నారా గోపాల్, సభ్యులు కె.శ్రీనివాసులు, ఎన్ నారాయణ, జి.శ్రీనివాసులుతో పాటు పలు ప్రజాసంఘాల ప్రతి నిధులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. తొలుత డా.విజయకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# జెన్కో కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలి



జెన్కో ఎం.డీకి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ముత్తుకూరు మండలం నేలటూరులో ఉన్న శ్రీ దామోదరం సంజీవయ్య జెన్కో ప్రాజెక్టులో పనిచేసే కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని సంబంధిత విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈనెల 13న విజయవాడలో ఏపి జెన్కో ఎం.డి శ్రీధర్‌కు ఆమేరకు విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ యండవల్లి శ్రీనివాసులురెడ్డి, జేఏసి ఛైర్మెన్ బాలకాశి, కన్వీనర్ మోహన్‌రావు, నాయకులు అనిల్. ఎం రవీంద్ర తదితరులు జెన్కో ఎం.డిని కలిశారు. నేలటూరు విద్యుత్‌కేంద్రాన్ని ఏపి జెన్కోలోనే కొనసాగించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యమే నేరుగా జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

# సాయిదర్బార్ భక్తబృందానికి.. విశిష్ట పురస్కారం

## రక్తదానంలోనూ విశేష సేవలు



అవార్డు అందుకుంటున్న సాయిదర్బార్ మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన్‌సాయి

నెల్లూరు, బాలాజీ నగర్ శివారుల్లో ఉన్న శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరంలో ఆధ్యాత్మిక సేవలందిస్తున్న పలువురు భక్తులు మాధవసేవతో పాటు మానవసేవ కూడా చేస్తూ తమ సేవానిరతిని చాటుకుంటున్నారు. గత ఎనిమిదేళ్ళుగా రెడ్‌క్రాస్, నోవా బ్లడ్‌బ్యాంక్‌ల సహకారంతో సాయిదర్బార్ యువసేవాదళ్ ఆధ్వర్యంలో సాయిభక్తులు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ పేదరోగులకు రక్తాన్ని అందిస్తున్నారు. ఇప్పటిదాకా సుమారు 600మందికి పైగానే సాయిభక్తులు ఈ శిబిరాల్లో రక్తదానం చేశారని, అందుకు మెచ్చుకున్న నోవా బ్లడ్‌బ్యాంక్ వారు ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో సాయిదర్బార్ భక్తబృందానికి బెస్ట్ బ్లడ్‌డోనర్, మోటివేటర్ పురస్కారాన్ని ప్రదానం చేశారని సాయిదర్బార్ మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధు సాయి తెలిపారు. భక్తబృందం తరఫున ఆ పురస్కారాన్ని ప్రముఖ సినీనటుడు భానుచంద్ర చేతులమీదుగా తనకు అందజేశారని ఆయన పేర్కొన్నారు. శ్రీ సాయిబాబాపై అచంచల భక్తితో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను సాయిదర్బార్ యువసేవాదళ్ తోడ్పాటుతో మరింత ఉత్సాహంతో కొనసాగిస్తామని ఆయన చెప్పారు.



## మా బడిని
# విలీనం చేయొద్దు

### కాకొల్లువారిపల్లి గ్రామస్తుల విన్నపం

తమ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తే విద్యార్థులు ఎంతగానో ఇబ్బందులు పడాల్సివస్తుందని, కనుక ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి తమ పాఠశాలను విలీనం చేయవద్దని వరికుంటపాడు మండలంలోకి కాకొల్లువారిపల్లి గ్రామస్తులు వేడుకుంటున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలకు తరలించాలని చూడడం దారుణమని, ఉన్నత పాఠశాలలో గదుల కొరత, బెంచీలు లేకపోవడం, తాగునీటి వసతి వంటి మౌలికవసతులు లేవని, అలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు వెళ్తే ఎన్నో ఇబ్బందులు పడాల్సివస్తుందని విద్యార్థుల తల్లితండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమేరకు వారు ఈనెల 13న తహశీల్దార్‌కు, మండల అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

# ఫేస్ లెస్..!

దేశం వెలిగిపోతోంది
ముఖాలు మాత్రం తగలబడి
పోతున్నాయి.
మనుషులు చిత్రవధను
అనుభవిస్తున్నారు.
పాలకులకు ప్రజల మొహం
మొత్తేసిందో ఏమో
పాలితులపై కసి పేట్రేగిపోతోంది
స్వంత ముఖం లేని
వాళ్ళ దయనీయతే
కదా పట్టాభిషిక్తం చేసింది
ముఖాన్ని మొలిపించడానికి
ముఖాన్ని తగిలించడానికి
అవకాశం ఇవ్వలేనితనం
ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది
అందుకే వాళ్ళ ముఖాల్ని
చూసే వ్యామోహాల్ని
గంగలో ముంచేసింది
ముఖారవిందాల్ని పరికించాల్సిన
అధినేతలు
ముఖ కదలికల్నే పాతరేస్తున్నారు
జనం ఆర్థిక ఛిద్రానికి
ఒడిగట్టే కసాయితనం
ప్రజాస్వామ్యాన్ని మంటల్లో
తగులబెట్టడం కాదా!
యంత్రాలు పల్లకిలో ఊరేగుతూ
మనుషుల్ని గద్దల్లా
పీక్కుతింటున్నాయి.
మానవ కళేబరాలపై డిజిటల్
జిల్లేళ్ళు మొలుస్తున్నాయి.
అపభ్రంశపు ముఖాల్ని
చూడకూడదనుకొన్నారో ఏమో
చేసిన నిర్వాకానికి 'మహాప్రభో'
అని కుమిలి కుమిలి ఏడవాలి
కొత్త కొత్తగా రాగాలు తీయాలి
అదే ఫేస్ లెస్ మూల్యాంకనం
ఏకాంత సమూహాలు
పతనం దిశగా పరుగులుపెట్టే
అష్టదిగ్బంధనం!



చిన్ని నారాయణరావు
9440202942

# ఆత్మకూరు బరిలో.. 14 మంది

## • పోటీ నుంచి తప్పుకున్న ఒక స్వతంత్ర అభ్యర్థి

ఆత్మకూరు నియోజకవర్గానికి ఈనెల 23న జరుగనున్న ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కూడా పూర్తికావడంతో ఎన్నికల బరిలో 14మంది అభ్యర్థులు ఖరారయ్యారు. వచ్చిన నామినేషన్లలో మొత్తం 15 మంది నామినేషన్లు ఆమోదం పొందగా నామినేషన్ల పరిశీలన అనంతరం బొర్రా సుబ్బారెడ్డి తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో 14 మంది నిలచినట్లయింది. వైకాపా అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి, భాజపా అభ్యర్థిగా గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, బిఎస్పీ అభ్యర్థిగా నందా ఓబులేసు, షేక్ జలీల్ (నవరంగ్ కాంగ్రెస్), షేక్ మొయినుద్దీన్ (ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్), బందారు రవి (హర్దామ్ మన్వట్టాడి రాష్ట్రీయదళ్), పెయ్యల హజరత్తయ్య (జనం మనం పార్టీ), షేక్ మహబూబ్‌బాషా (అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్)లతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఆరుగురు బూరగ రత్నం, చల్లా పెంచల మోహన్, పెనాక అమర్నాథ్‌రెడ్డి, రావులకొల్లు మాలకొండయ్య, తూమాటి శశిధర్‌రెడ్డి, లాలి వెంకటయ్యలు రంగంలో ఉన్నారు.

# పవన్‌కల్యాణే.. కాబోయే ముఖ్యమంత్రి

## - జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్ జోస్యం



బోగోలులో పార్టీ సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి

రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కల్యాణేనని, ఎన్నికలెప్పుడు వచ్చినా అధికారంలోకి వచ్చేది జనసేన పార్టీయేనని జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఈనెల 12న బోగులులోని కల్యాణమండపంలో ఆ పార్టీ క్రీయాశీలక సభ్యత్వం బీమా కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం పవన్‌కల్యాణ్ నిరంతరం చేస్తున్న కృషిని వివరించారు. అందరూ కలసికట్టుగా పనిచేసి జనసేన విజయానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అలహరి సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు నూరుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు సుధీర్, ప్రధాన కార్యదర్శి కిషోర్, కావలి పట్టణ జనసేన అధ్యక్షుడు పి.సాయి, కార్తీక్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆ జీఓను వెంటనే రద్దు చేయండి




కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏపిటిఎఫ్ నాయకులు

పేద విద్యార్థులను చదువులకు దూరం చేసే ఉపాధ్యాయుల పునర్విభజన జిఓ 117ను ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపిటిఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ధర్నాందోళన నిర్వహించారు. 3,4,5 తరగతులను హైస్కూళ్ళకు తరలించడం ద్వారా పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఏపిటిఎఫ్ నాయకుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 80 శాతం దాకా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారతాయన్నారు. ప్రభుత్వం, అధికారులు వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసి ఉపాధ్యాయ సంఘాలతో కూడా చర్చించి అందరికీ విద్యను అందించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ ఆందోళనలో ఏపిటిఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎం. పిచ్చిబాబు, నాయకులు జుల్ఫికర్ ఆలీ, కృష్ణారెడ్డి, ఎస్‌కె రియాజ్, సుబ్బారెడ్డి, ఏవి రావు, ఆర్ వెంకటేశ్వర్లురెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డా. జెట్టి శేషారెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రజావైద్యుడు, సమాజసేవకుడు దివంగత డాక్టర్ జెట్టి శేషారెడ్డి సేవలు చిరస్మరణీయమని నెల్లూరులోని పలువురు ప్రజావైద్యశాల వైద్యులు కొనియాడారు. డా. జెట్టి శేషారెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని హరనాథపురంలో ఉన్న డా.జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో ఈనెల 13న జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డా. రామచంద్రా రెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు చంద్ర రాజగోపాల్, సిఐటియు కార్యదర్శి మోహన్‌రావు, డాక్టర్ అజయ్‌కుమార్, డాక్టర్ దత్తాత్రేయులు, డాక్టర్ రమణయ్య, న్యాయవాది శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో భారీ మెజారిటీని..

# సిఎంకు కానుకగా ఇవ్వాలి

### - నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఆత్మకూరు ఉప ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి విక్రమ్‌రెడ్డిని గెలిపించడమే కాక భారీ మెజారిటీని సిఎంకు కానుకగా ఇవ్వాలని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల సంగంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆదాల మాట్లాడుతూ మెజారిటీ తగ్గితే తెలుగుదేశం పార్టీ లేని పోని దుష్ప్రచారాలు చేస్తుందని అంటూ కార్యకర్తలు ఈ ఎన్నికల్లో మంచి మెజారిటీ వచ్చేందుకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణస్వామి, కోవూరు, సూళ్ళూరుపేట ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, డిసిఎంఎస్ అధ్యక్షుడు వీరి చలపతిరావు, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, స్వర్ణా వెంకయ్య, కోటీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. పాటు ఆత్మకూరు వైకాపా అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి, మంత్రులు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, నారాయణస్వామి, వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

**మంత్రులతో ఆదాల చర్చ :**

ఆత్మకూరు నియోజకవర్గంలో జరగనున్న ఉప ఎన్నికలో భారీ మెజార్టీని సాధించేందుకు ఇటీవల వైకాపా ముఖ్యనేతలతో నెల్లూరు ఎంపీ ఆదాల సమావేశమయ్యారు. ఎన్నికల్లో ప్రచారం ఏవిధంగా ఉండాలన్న అంశంపై నాయకులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఆదాలతో

## జెన్కో కోసం..తుదిశ్వాస దాకా పోరాటం

ముత్తుకూరులోని జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రైవేటీకరణకు గురికాకుండా కాపాడుకోవడమే తమ ధ్యేయమని, అందుకోసం తుదిశ్వాస దాకా ఎంతటి పోరాటానికైనా సిద్ధమని జెన్కో ఉద్యోగ కార్మికులు తెగేసి చెప్పారు. ఈనెల 15న నేలటూరులోని జెన్కో థర్మల్ కేంద్రం ఎదుట ఉద్యోగ కార్మికుల జేఏసి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. నష్టాల సాకుతో విద్యుత్‌కేంద్రాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు.

# ఓ తండ్రి ఘాతుకం

- కన్నబిడ్డ నోటి నుండా.. కుంకుమ పొడి కుక్కి చంపబోయిన కర్కశం.. పేరారెడ్డిపల్లిలో దారుణం

రానురాను మనుషుల్లో మానవత్వం నశించిపోతోంది. రాక్షసత్వమే వీరంగం చేస్తోంది. కన్నకూతురిపైనే క్షుద్రపూజలు చేస్తూ నోటినిండా కుంకుమ పోసి గొంతు నులిమి చంపేందుకు ఓ ఉన్మాది తండ్రి ప్రయత్నించడం స్థానికులను కలచివేసింది.



ఉన్మాదైన తండ్రి



చిన్నారి పునర్విక

ఆత్మకూరు మునిసిపాలిటీలోని పేరారెడ్డి పల్లిలో వేణు అనే ఉన్మాది తండ్రికి ఇద్దరు కవలపిల్లలున్నారు. ఇద్దరూ చిన్నపిల్లలే..ఇద్దరూ ఆడపిల్లలే. వారిలో నాలుగేళ్ళ పాప పునర్విక‌ను దేవుడిగదిలో కూర్చోబెట్టి పూజలు చేస్తూ.. ఆ బిడ్డ నోటి నిండా కుంకుమ కుక్కుతుండడంతో ఆ పాప ఊపిరాడక కేకలు పెట్టింది. దీంతో పాప అరవకుండా గొంతు నులుముతుండగా గమనించిన మేనమామ, ఆ చుట్టుపక్కల వారంతా కలసి పాపను ఆ ఉన్మాది బారినుంచి కాపాడి వెంటనే ఆత్మకూరులో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆ బిడ్డ పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు, ఆ తర్వాత అక్కడి నుంచి చెన్నైకి తరలించారు. ఉన్మాదిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాప బతుకుతుందో లేదో తెలియడం లేదని తల్లి, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. వేణుపై హత్యాయత్నం కేసు పెట్టి ఎస్ఐ శివశంకరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

# నిరుద్యోగులను బురిడీ కొట్టించారు

నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి, రకరకాల ఆశ చూపి కుచ్చుటోపీ పెట్టేసేవారిని అప్పుడప్పుడూ చూస్తూనే ఉంటాం. కానీ, ఏకంగా అధికారులంతా ఉండే కలెక్టరేట్ ఆవరణంలోనే మకాం పెట్టి మోసాలకు పాల్పడడం విడ్డూరమే. నిరుద్యోగులకు అనుమానం రాకుండా ఆ మోసగాళ్ళు కలెక్టరేట్ ఆవరణంలోనే ఈ మోసాలకు పాల్పడ్డారంటే.. వారి తెగింపు చూడండి!.. అందులోనూ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి కూడా ఇందులో ఉండడం ఇంకా ఘోరం! ఈ విషయం తెలియడంతో జిల్లా ఉపాధి కల్పన అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అసలు విషయం బట్టబయలైంది. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరుకు చెందిన అఖిల్, భానుప్రకాష్, బాలాజీ, కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ విభాగంలో పనిచేస్తున్న సురేష్.. వీరంతా కలసి ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా కంప్యూటర్ ఆపరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఉద్యోగాలిప్పిస్తామంటూ, కార్యాలయ సిబ్బంది ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామంటూ నిరుద్యోగులను బురిడీ కొట్టించారు. వారికి ఆశలుచూపించి డబ్బులు దండుకోవడం ప్రారంభించారు. సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్నట్లు నటించి, నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు కూడా ఇచ్చేసి భారీగా దండుకోవడానికి మరిగారు. ఇదంతా నమ్మిన నిరుద్యోగులు ఉద్యోగంలో చేరడానికని కలెక్టరేట్‌కు కూడా వచ్చేశారు. అప్పటికి గానీ అసలు సంగతి తెలియలేదు. ఈ ఛీటింగ్ వ్యవహారమంతా కలెక్టరేట్ పరిపాలనాధికారి సుబ్రహ్మణ్యం దృష్టికి రావడంతో ఆయన ఉపాధి అధికారికి తెలపడం, ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగాయి.

# ఎట్టకేలకు 'పింఛన్' దొంగలు దొరికారు

- రెండు దోపిడీలూ ఒకే ముఠావే
- ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ.15.89 లక్షలు, 6 బైక్‌లు స్వాధీనం

***అర్హులకు పింఛన్ అందించడానికి తీసుకువెళ్తున్న 15.55 లక్షల రూపాయలున్న బ్యాగ్‌ను దారికాచి దొంగలు దోచుకుపోయారు. బైక్‌పై వెళ్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్‌ను అటకాయించి డబ్బు సంచిని లాక్కొని బైక్‌మీద ఉడాయించారు. ఇలాంటి దోపిడీనే గతంలో గత ఏడాది ఏప్రిల్‌లో కూడా చేశారు. ఈ దోపిడీలు జిల్లా వ్యాప్తంగా సంచలనం కలిగించాయి. ఎట్టకేలకు పోలీసులు ఈకేసును ఛేదించి నిందితులను పట్టుకున్నారు. తీగ లాగితే డొంకంతా కదిలినట్లు చివరికి ఆ దొంగల ముఠా అంతా దొరికిపోయింది.***



దోపిడిముఠా నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ విజయారావు

గతనెల 31న బోగోలు మండలంలోని చెన్నారాయునిపాళెం సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ బిట్రగుంటలోని స్టేట్‌బ్యాంకు నుంచి పింఛన్ డబ్బు 15,55,500 రూపాయలను డ్రా చేసుకుని బైక్‌పై వస్తుండగా మార్గమధ్యంలో అల్లూరు మండలంలోని ఉడ్‌హౌస్‌పేట వద్ద ఇద్దరు దుండగులు అటకాయించి డబ్బున్న బ్యాగ్‌ను లాక్కునిపోయిన ఘటనలో నిందితులు పోలీసులకు దొరికిపోయారు. దొంగలు ఎంత తెలివిగా డబ్బు దోచుకుపోయినా, పోలీసులు అంతకంటే తెలివిగా సాంకేతిక పరిజ్ఞానంతో సునాయాసంగానే కేసును ఛేదించారు. రెండు వారాల్లోనే ఈ దొంగలముఠాను పట్టుకోవడం విశేషం. ఈనెల 15న జిల్లా ఎస్పీ విజయారావు నెల్లూరులో ఆ కేసు పూర్వాపరాలను విలేకర్లకు వివరించారు.

**గతంలో దోపిడీ కూడా..**

**ఈ ముఠాదే :**

ఇదే దోపిడీ ముఠాకు చెందినవారు గత ఏడాది కూడా అదే ఉడ్‌హౌస్‌వద్ద ఇదేవిధంగా పింఛన్‌డబ్బును దోచుకున్నారు. జువ్వలదిన్నె వెల్ఫేర్ అసిస్టెంట్ 3.09 లక్షల రూపాయల పింఛన్ డబ్బును తీసుకు వస్తుండగా అటకాయించి డబ్బు సంచీని పెరుక్కునిపోయారు. ఈ ఘటనలో ఈ ముఠాకు చెందిన ఉదయ్‌బాబు, తేజారెడ్డిలు దోపిడీకి పాల్పడ్డారని, వారికి నరేంద్రప్రసాద్, శశికిరణ్‌లు సహకరించారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ రెండు కేసుల్లోనూ నిందితులందరినీ అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మొత్తం 15.89 లక్షల రూపాయల నగదుతో పాటు, 6 మోటార్‌బైక్‌లు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలియజేశారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన ఏఎస్పీ చౌడేశ్వరి, రూరల్ డిఎస్పీ వై.హరినాథ్‌రెడ్డి, కోవూరు, కావలి సిఐలు కె.రామకృష్ణారెడ్డి, షేక్ ఖాజావలి, అల్లూరు -బిట్రగుంట ఎస్ఐలు శ్రీనివాసులురెడ్డి, బలరామయ్య, తదితర పోలీసు సిబ్బందిని అభినందించి వారికి రివార్డులందజేశారు.

### పాత వలంటీర్ పన్నాగంతోనే దోపిడీలు

గతంలో వలంటీర్‌గా పనిచేసి, ఆ తర్వాత ఓ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సంగతి నరేంద్రప్రసాద్ ఈ దోపిడీలకు సూత్రధారి అని పోలీసులు తేల్చారు. బోగోలు మండలం ముంగమూరుకు చెందిన ఆ వ్యక్తి గతంలో వలంటీర్‌గా పనిచేసి మానేశాడు. పింఛన్ సొమ్మును బ్యాంకు నుండి ఎవరు ఎలా తీసుకువస్తారు, ఏ మార్గంలో తీసుకుపోతారనే విషయాలు ప్రసాద్‌కు బాగా తెలుసు. దీంతో పక్కా పథకం వేసి పింఛన్‌సొమ్మును దోచేసేందుకు మరికొందరితో కలసి పన్నాగం పన్నాడు. పాత నేరస్తులైన ముసునూరు గ్రామానికి చెందిన దారా ఉదయ్‌బాబు, సముద్రాల చిన్నాలతో కలసి దోపిడీకి పథకం వేశాడు. వీరికి బోగోలు మండలంలోని కొరిసిపాటి ప్రసన్నకుమార్‌రెడ్డి, ముసునూరుకు చెందిన కె.శివకృష్ణ, దేవరపల్లి తేజారెడ్డి, బోగోలుకు చెందిన చల్లా శశికిరణ్‌తో పాటు మరో ఇద్దరు సహకరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీచేసిన మోటార్‌సైకిళ్ళతోనే వీరు ఈ దోపిడీకి పాల్పడ్డారు. సిసి కెమెరాలకు దొరక్కుండా తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే ముసునూరు ప్రాంతంలో ఇద్దరు నిందితుల సిసి ఫుటేజీలను సేకరించి ఆ ఫోటోలను మీడియాకు విడుదల చేయడంతో నిందితులు పోలీసులు గుర్తించిన మోటార్‌సైకిల్‌ను కూడా ముసునూరు వద్ద ఓ నీటిగుంటలో పడేశారు. దానిని కూడా పోలీసులు గుర్తించి వెలికితీశారు.

# కలిసిన నేతలు.. కలవని దారులు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన వెనకడుగు వేశారు. రాష్ట్రపతిగా ఎన్నికయ్యే అవకాశాలు లేనందున, పరువు పోగొట్టుకోవడం ఇష్టం లేనందున కాబోలు ప్రతిపక్ష నేతల ప్రతిపాదనను ఆయన తిరస్కరించారు. ఇప్పుడు వారికి మరో అభ్యర్థి కనిపించడం లేదు.

తమ మధ్య గల 'అనైక్యత'ను దేశ ప్రజల ముందు ఈ విధంగా ప్రతిపక్షాలు ఆవిష్కృతం చేసుకున్నాయని పరిశీలకులు అంటున్నారు. శరద్ పవార్ తిరస్కారంతో, మరొకరిని బరిలో దించడం కోసం రేపు 21న సమావేశం కావాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. రాష్ట్రపతి పదవికి నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఈ నెల 23. అందువల్ల, ఎవరి ఆట వారు ఆడుకోడానికి కావలసినంత సమయం ఉంది.

రాష్ట్రపతి నిలయంలో తన 'రాజకీయ ప్రతిరూపా'న్ని ప్రతిష్ఠించే లక్ష్యంతో ప్రధాని మోడి, తమ అభ్యర్థిని ఈ నెల 21, 22 తేదీలలో తెరపైకి తీసుకు రావచ్చు. ఎన్‌డీఏ పేరిట 49 శాతం ఓట్ల ఎలక్టోరల్ కాలేజీలో ఉన్నప్పటికీ, అనధికారికంగా ఎన్‌డీఏకి మద్దతు తెలిపే మన వైసీపీ, ఒడిసా బీజేడీ వంటి కొన్ని పార్టీలు ఉన్నందువల్ల మోడీ నిర్ణయించిన అభ్యర్థికి 55 నుంచి 60 శాతం ఓట్లు రావచ్చునని రాజధాని పరిశీలకుల అంచనా. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులకు ఇప్పటి రాష్ట్రపతి రామనాథ్ కోవింద్, వెంకయ్యనాయుడే మరో మారు ఎంపిక అయ్యే అవకాశాలు కూడా లేకపోలేదన్న అభిప్రాయం కూడా విశ్లేషకుల నుండి వినపడుతోంది. ఈ ఇద్దరితో ఆయనకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకపోవడమే ఇందుకు కారణం అని కూడా వారు అంటున్నారు.

మొత్తం మీద, ప్రతిపక్షాల అనైక్యతను ఈ సందర్భం తేటతెల్లం చేసింది. 2024 ఎన్నికల్లో మోడి(బీజేపీ) అధికారంలోకి రాకుండా ఇవి నిలువరించలేవు, అన్న స్పష్టమైన సంకేతాలను ఓ రెండేళ్ళ ముందుగానే దేశ ప్రజలకి ప్రతిపక్షాలు చాటి చెప్పాయి అన్న భావన కూడా చాలామందిలో వ్యక్తమవుతోంది. ప్రతిపక్షాల సమావేశం ఆ భావనకి బలాన్ని చేకూర్చిందని కూడా చెప్పవచ్చు. తమ అధికార బలాన్ని చూపించుకునే ప్రయత్నంలో ప్రతిపక్షాలు చేసిన ప్రయత్నం, వారిని అభాసుపాలు చేయడంతో పాటు మోడీ బలాన్ని మరింత పెంచింది. ఈ పరిణామాలన్నీ మోడీ నాయకత్వానికి కొత్త జవసత్వాలను చేకూరుస్తున్నాయన్నది మాత్రం ఎవ్వరూ కాదనలేని నిజం.

### రాహుల్, సోనియాలకు

# ఇ.డి నోటీసులు హేయం

**- చేవూరు దేవకుమార్‌రెడ్డి**



అఖిల భారత కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, సోనియాగాంధీలకు ఇ.డి నోటీసు లివ్వడం హేయమైన చర్య అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని మోడీ రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన విమర్శించారు. స్వచ్ఛందంగా దర్యాప్తు చేసిన దోషులను శిక్షించాల్సిన ఇ.డి నిరాధారమైన ఆరోపణలతో రాహుల్, సోనియాలను విచారించడం దారుణమన్నారు. రాహుల్ పట్ల దేశవ్యాప్తంగా ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలను చూసి ఓర్వలేక, ప్రధాని రేసులో ఉన్న రాహుల్‌ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక రాజ్యాంగ వ్యవస్థలతో కలసి బిజెపి ప్రభుత్వం ఇలా అక్రమ కేసులను బనాయిస్తుండడం సిగ్గుచేటని ఆయన దుయ్యబట్టారు. నరేంద్ర మోడీ, అమిత్‌షాల కుట్రలే ఇందుకు కారణమన్నారు. బిజెపి అసత్య ఆరోపణలు ఎన్ని చేసినా వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం తథ్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కక్షపూరితంగా వ్యవహరిస్తున్న బీజేపీ తన తీరు మార్చుకోకపోతే ఉద్యమాలు తప్పవన్నారు.

### వాకర్లకు రక్తదానంపై...

# సందేహాల నివృత్తి




ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న నెల్లూరు లోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్లకు రక్తదానంపై అవగాహన కలిగించారు. సంఘం అధ్యక్షులు కొండూరు సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ సిహెచ్ అజయ్‌బాబు పాల్గొని రక్తదానం విశిష్టతను వివరించారు. రక్తదానంపై సందేహాలను నివృత్తిచేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ అంకిరెడ్డి, రావూరు సుబ్బారావు, శ్రీనివాసులు, విజయరాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల

# అపూర్వ సమ్మేళనం

### కోవూరు జెబిఆర్ స్కూల్ కళకళ



కోవూరు జెబిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు నలభై ఏళ్ళ క్రితం చదువుకున్న విద్యార్థులు ఇటీవల ఆ పాఠశాలలో కలుసుకుని తాము చదువుకున్నప్పటి రోజుల్లోని జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకుంటూ మురిసిపోయారు. దీంతో ఆ పాఠశాల పూర్వవిద్యార్థుల ఆనందోత్సాహాలతో కళకళలాడింది. 1983వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న అనేకమంది పూర్వవిద్యార్థులు ఈ అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్నారు. అప్పట్లో తమకు చదువుచెప్పిన గురువులను స్వాగతించి వారికి పాదపూజలు చేసి గురుభక్తిని చాటుకున్నారు. తమ జీవితాలకు బంగరుబాటలు వేసిన నాటి ఉపాధ్యాయులు ఎ.శ్రీనాథ్‌ప్రసాద్, సిహెచ్ వెంకటేశ్వర్‌రావు, జి.సుగుణకుమారి, కె.సుందరేశయ్యలను ఘనంగా సన్మానించుకున్నారు. వారి ఆత్మీయాభిమానాలతో గురువులు సంతోష భరితులయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కృష్ణారెడ్డి, మధుసూదన్‌రావు, భాను, శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, గోపాలకృష్ణ, మోషేస్, చక్రధర్ తదితరులున్నారు.

# ఉండవల్లి అక్షర సత్యాలు!



ఉండవల్లి అరుణ్‌కుమార్! రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న వారికి తెలుగు రాష్ట్రాలలో ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేని పేరు. పంపులో నుంచి నీరు వచ్చినంత సరళంగా... జలపాతం అంత దూకుడుగా... చాకు పెట్టి కేకు కోసినంత స్పష్టంగా... సూటిగా తన ఆలోచనలను ఏ వేదిక మీదనైనా చెప్పగలిగిన మాజీ ఎంపీ అరుణ్‌కుమార్. చెప్పడంలో మొహమాటం లేదు. బహిరంగ సభల్లో రాజీవ్‌గాంధీ హిందీ ఉపన్యాసాలను తెలుగులోకి అర్థవంతంగా... సభికులను ఆకట్టుకునే విధంగా... తాను హిందీలో చెప్పింది సభికులకు చక్కగా అర్థమైందని సభికుల ముఖ కవళికలను, హర్షధ్వానాల స్పందనను చూసి రాజీవ్‌గాంధీ తృప్తిగా తనవంక చూసేవిధంగా తెలుగులోకి అనువదించే యువకుడిగా ఉండవల్లి అరుణ్‌కుమార్ నాటి రాష్ట్ర రాజకీయాలకు పరిచయమైన యువకుడు. రాజమండ్రిలో జంట యువ నేతలుగా కాంగ్రెస్‌లో ప్రసిద్ధమైన జక్కంపూడి రామమోహన్‌రావు, ఉండవల్లి అరుణ్‌కుమార్... డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డికి తూర్పు గోదావరి జిల్లాలో కళ్ళు, చెవులు. కృష్ణార్జునులు. ఉండవల్లిది బుద్ధి బలం. జక్కంపూడిది నోటి బలం, భుజబలం. రాజమండ్రి కాంగ్రెస్‌కు కేరాఫ్ అడ్రస్ వీరిద్దరు.

వై.ఎస్ ప్రోద్భలంతోనే ఉండవల్లి రెండుసార్లు 2004, 2009లో రాజమండ్రి నుంచి లోక్‌సభకు పోటీచేసి గెలిచారు. మొదటిసారి వై.ఎస్ హవా ఆయనను గెలిపిస్తే రెండోసారి అనపర్తి ఎం.ఎల్.ఏ అయిన కాంగ్రెస్ అభ్యర్థి నల్లమిల్లి శేషారెడ్డి గెలిపించారు. తూర్పు గోదావరిలో రెడ్ల నియోజకవర్గం అనపర్తి.

వై.ఎస్ బతికుంటే, ఉండవల్లి ఎక్కడో ఉండేవారు. ఈనాడు రామోజీరావూ ఎక్కడో ఉండేవారు. ఆయన అకాల మరణంతో, ఉండవల్లి రాజమండ్రిలోనే ఉండిపోతే రామోజీరావు ఫిలిం సిటీలోనే ఉండిపోయారు.

తెలుగునాట రాజకీయాలకు 'రాజకీయం' నేర్పిన 'కేవీపీ రామచంద్రరావు నా గాడ్‌ఫాదర్' అని అప్పుడూ ఇప్పుడూ, ఎప్పుడూ చెప్పుకోడానికి ఏమాత్రం మొహమాట పడని ఉండవల్లి అరుణ్‌కుమార్, ప్రస్తుత ఆంధ్ర రాజకీయాలపై అద్భుతమైన వ్యాఖ్యలు చేశారు. కేవీపీ రామచంద్రరావు ప్రస్తావన లేకుండా అరుణ్‌కుమార్ ప్రొఫైల్‌కు సమగ్రత రాదు.

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన అనంతరం... ఉండవల్లి రాజమండ్రి వెళ్లి మీడియాతో మాట్లాడుతూ (రాజమండ్రి ఆయన ఫేవరెట్ ప్రెస్ స్పాట్. అనుకోకుండా కేంద్రమంత్రి అయితే కూడా రాజమండ్రి వచ్చి, అక్కడి ప్రెస్‌తోనే మాట్లాడతారు. ఢిల్లీలో మాట్లాడరు) ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ప్రత్యేకంగా ఓటింగ్ ఏమీ లేదని కానీ, 25 లోక్‌సభ స్థానాలూ బీజేపీవేనని అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కన్నా ఆంధ్రలోనే బీజేపీ బలంగా ఉందని అన్నారు.

ఈ మాటలు గతంలో ఎవరూ చెప్పలేదు. అలా చెప్పగలగడానికి ఓ స్థాయి ఉండాలి. అలా చెప్పగలగడం ఒక్క ఉండవల్లి అరుణ్‌కుమార్‌కే చెల్లింది. ఆయన మాత్రమే చేయగలిగిన వ్యాఖ్యలు అవి.

ఆయనకు ఏ పార్టీతోను ప్రత్యక్ష సంబంధాలు లేవు. ఏ పార్టీ పట్ల మొహమాటాలు లేవు.

రాష్ట్రంలో వైసీపీ ఇప్పుడు అధికారంలో ఉంది. ఏపీ నుంచి లోకసభలో 25స్థానాలు ఉంటే, వైసీపీకి 22 మంది సభ్యులు ఉన్నారు. టీడీపీకి ముగ్గురు సభ్యులు ఉన్నారు. మధ్యలో అభిమానులు, సభ్యుల కోలాహలం తప్ప, సీట్ల గొడవ ఏమీ లేని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉన్నారు.


రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలకు 'నువ్వు కారణమంటే.... నువ్వు కారణం' అంటూ మైకులలో దుమ్మెత్తి పోసుకుంటారు.. ఒకరినొకరు తీవ్రంగా విమర్శించుకుంటారు. ఒకరిని ఒకరు పేర్లు పెట్టుకుంటారు. హెకిల్ చేసుకుంటారు. తాట తీస్తా అంటారు. ఖబడ్దార్... నీ గుండెల్లో నిద్రపోతా అంటారు.

కానీ, బీజేపీని పల్లెత్తు మాట అనరు. సరదాగా కూడా అనరు. నిద్రలో కూడా అనరు.

'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అంటూ తెలుగువారు ముక్తకంఠంతో నినదించి, 1966 నవంబర్ 1వ తేదీన తొమ్మిది మంది తెలుగువారి బలి దానంతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని గుజరాతీ వ్యాపారులకు బేరాకు, పావలాకు కట్ట బెడుతుంటే, మన పార్టీలు కేంద్ర బీజేపీని నిలువరించలేవు. కనీసం విమర్శించలేవు. దీనికి వైఎస్సార్ కాంగ్రెస్సే కారణం అంటూ టీడీపీ అంటుంది. కానీ, బీజేపీని పల్లెత్తు మాట అనదు. తెలుగు రాష్ట్రానికి నెత్తిమీద నీళ్ల పంపు లాంటి పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్ట్ చంకనాకి పోతుంటే 'నువ్వు కారణం అంటే, నువ్వు కారణం' అని వైసీపీ... టీడీపీ దుమ్మెత్తి పోసుకుంటాయి గానీ, కేంద్రాన్ని చిన్న మాట అనవు. రాష్ట్రానికి విభజన సమయంలో హామీ ఇచ్చిన విధంగా, ప్రత్యేకహోదాను 'ఇవ్వం పోండి. దిక్కున్నకాడ చెప్పుకోండి' అని కేంద్రం అంటుంటే.. టీడీపీ, వైసీపీ ఒకరిని ఒకరు ఆడి పోసుకుంటున్నారు, కానీ కేంద్రాన్ని ఒక్క మాట అనడం లేదు. మళ్ళీ కేంద్రానికి కావలసి వచ్చినప్పుడు మాత్రం, ఇద్దరూ ఉరుకులు, పరుగులు మీద వెళ్లి చేతులు ఎత్తుతారు. ఈ పరిస్థితి ఏ రాష్ట్రంలోనూ దాదాపుగా లేదు.

తమిళనాడులో డీఎంకే, కేరళలో కాంగ్రెస్, మహారాష్ట్రలో శివసేన - ఎన్‌సీపీ - కాంగ్రెస్, కర్ణాటకలో కాంగ్రెస్, ఢిల్లీలో ఆప్, బెంగాల్‌లో మమత, చివరికి బీహార్‌లో బీజేపీ మిత్రపక్షమైన జనతాదళ్(యూ) సమయ, సందర్భాలను బట్టి బీజేపీని ఎండగడుతుంటాయి. కానీ, ఆంధ్రలో ప్రధాన పార్టీలైన వైసీపీ, టీడీపీ, జనసేన బీజేపీని ఏమీ అనవు. అందుకే, ఆ పార్టీలను ఉండవల్లి అరుణ్‌కుమార్ తన సెటైర్‌తో ఓ (బల్లెం పోటు లాంటి) పోటు పొడిచినా ఈ మూడు పార్టీలు కుయ్... కయ్.... అనలేదు. కనీసం ఖండించలేదు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు కూడా ఉండవల్లి ఉండే రాజమండ్రిలోనే ఉంటారు, నాలుగు వీధులు అవతల. తెల్లారి లేస్తే, ఒకే ఊరు కదా... అని ఉండవల్లి వ్యాఖ్యల మీద నోరెత్తకుండా, ఓ టీవీ డిబేట్ల స్పెషలిస్టు యువ నాయకుడికి కన్ను గిలిపి ఉంటారు, ఉండవల్లి స్టేట్‌మెంట్‌ను ఖండించూ అని. ఆయనో ట్వీట్ కొట్టారు, ఖండిస్తూ. పిచ్చుక పలుకులు పలికారు.



### మనలో మాట 74

బీజేపీకి దక్షిణాదిలో నికరంగా ఎదురు నిలబడడానికి ఫైనల్‌గా ముందుకు వచ్చింది టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్. ఒక్కరే కనపడుతున్నారు.

నిజానికి కాంగ్రెస్‌కు కూడా దేశంలో ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బీజేపీయే. అయితే, ఇక్కడ తెలంగాణలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిపోవాలి అని ఫిక్స్ అయిపోయారు. అక్కడ ఢిల్లీలో ప్రధాని అయిపోవాలని రాహుల్‌గాంధీ రెడీ అయిపోయారు. అవకాశం ఉన్న 2004, 2009లో ప్రధాని కావాలని ఆయనకు అనిపించలేదు. లాల్జి జేబుల్లో చేతులు పెట్టుకుని తిరిగారు. అవకాశం లేని ఇప్పుడేమో హైరానా పడుతున్నారు. దాంతో, టీఆర్ఎస్‌కు కాంగ్రెస్ కూడా ఇప్పుడు ఓ ప్రత్యర్థిగా రచ్చ రచ్చ చేస్తోంది. నిజానికి, ఇక్కడ తెలంగాణలో గానీ, అక్కడ ఢిల్లీలో గానీ కాంగ్రెస్‌కు అధికారంలోకి వచ్చేంత సీను లేదు.

క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను గమనంలోకి తీసుకుని, రేవంత్‌రెడ్డి గనుక టీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటిస్తే తెలంగాణలో ముందు బీజేపీని సింపుల్‌గా ఫినిష్ చేయవచ్చు. అప్పుడు కేంద్ర బీజేపీకి కూడా కాంగ్రెస్‌ను చూస్తే భయం పట్టుకుంటుంది. తరువాత, బీజేపీ సంగతి చూడవచ్చు.

నిజానికి, కేవలం 16 (ఒకటి ఓవైసీకి రిజర్వ్‌డ్. నో డిస్కషన్) లోక్‌సభ సీట్లున్న తెలంగాణ సీఎం బీజేపీని ఢీ కొనడమా అన్న సందేహాలు చాలామందికి ఉన్నాయి. కానీ, కావలసింది వ్యూహమే తప్ప, భుజ బలం కాదని కేజ్రీవాల్ నిరూపించారు. బీజేపీ కేంద్ర స్థానమైన, ప్రధాని మోదీ అధికార కేంద్రమైన ఢిల్లీలోనే కేజ్రీవాల్, తనదైన వ్యూహంతో బీజేపీకి చుక్కలు చూపించారు. 70 సీట్లకు 67 గెలిచారు. టెక్నిక్ ముఖ్యం. పశుబలం కాదు.

ఆ టెక్నిక్‌తోనే, ఆయన తెలంగాణను సాధించారు. రెండు ఎంపీ సీట్ల బలంతో కాదు. డాక్టర్ చెన్నారెడ్డి సాధించలేక పోయిన దానిని కేసీఆర్ సాధించారు. అదే టెక్నిక్ అంటే.

అందువల్ల, బీజేపీకి వ్యతిరేకంగా జాతీయస్థాయిలో ఉద్యమించడానికి అవసరమైన అన్ని రాజకీయ లక్షణాలు కేసీఆర్‌కు ఉన్నాయి. అనుభవమూ, అవగాహనా ఉన్నాయి.

మోదీకి ఎన్ని 'రాజకీయ విద్యలు' తెలుసో కేసీఆర్‌కూ అన్ని తెలుసు.

సీఎం స్థాయి నుంచి జాతీయ స్థాయికి లాంచ్ చేయడానికి వెనుక నుంచి ఎటువంటి శక్తులు దన్నుగా నిలబడ్డాయో, కేసీఆర్‌కూ అటువంటి శక్తులు ఉన్నాయి.

కావలసిందల్లా... రాష్ట్రానికో ఉండవల్లి అరుణ్‌కుమార్ లాంటి వ్యూహకర్త. ముఖ్యంగా దక్షిణ భారత రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటకలో జాతీయస్థాయిలో బీజేపీని ఢీ కొనగలిగిన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలని, ఆంధ్రకు బీజేపీ చేసిన, చేస్తున్న అన్యాయాలను నిస్సహాయంగా చూస్తున్న ప్రతి తెలుగువాడూ కోరుకుంటాడు.

**- భోగాది వేంకట రాయుడు**

# గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించే సరికొత్త పరికరం

- తొలిసారిగా చెన్నై అపోలో ఆసుపత్రిలో అందుబాటు
- 'హార్ట్ వాల్వ్' మార్పిడిలో..సరికొత్త విధానం
- 89 ఏళ్ల వృద్ధునికి విజయవంతంగా చికిత్స




*వైద్యరంగంలో నానాటికీ విస్తరిస్తున్న సరికొత్త సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకుంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న చెన్నై అపోలో ఆసుపత్రి.. హృద్రోగులకు భరోసాగా మరో సరికొత్త పరికరాన్ని అందుబాటులోకి తెచ్చింది. హార్ట్ వాల్వ్ రీప్లేస్ మెంట్ (గుండెనాళాల మార్పిడి) ప్రక్రియలో భాగంగా స్ట్రోక్ (గుండెపోటు) ప్రమాదాన్ని తగ్గించేందుకు సెంటినెల్ సెరిబ్రల్ ప్రొటెక్షన్ సిస్టమ్‌ను వినియోగించడం ఈ చికిత్స ప్రత్యేకత. ఆ పరికరాన్ని ఉపయోగించి విజయవంతంగా చికిత్సలు చేయడంలో చెన్నైలోని అపోలో ఆసుపత్రి దక్షిణ భారత దేశంలోనే నంబర్-1 స్థానంలో ఉండడం విశేషం.*

సెంటినల్ సెరిబ్రల్ ప్రొటెక్షన్ సిస్టమ్‌ను ఉపయోగించి, ఓ పండు వృద్ధునికి విజయవంతంగా చికిత్స చేసిన మరో ఘనతను సాధించుకుంది చెన్నైలోని అపోలో ఆసుపత్రి. అపోలో ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ మరియు ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సెంగొట్టువేలు, ఆయన బృందం ఆధ్వర్యంలో ఇటీవల ఈ సరికొత్త ప్రక్రియను అత్యద్భుతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సెంగొట్టు వేలు మాట్లాడుతూ 89 ఏళ్ల వృద్ధుడికి 2006వ సంవత్సరంలో గుండె ఆపరేషన్ చేశారని, అయితే ఆయనకి శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందితో పాటు వాపు లక్షణాలు కూడా ఉన్నాయని, పరీక్షించి చూస్తే గతంలో చేసిన ఆపరేషన్‌లో ధమని కవాటాలు క్షీణించినట్లు గుర్తించామని చెప్పారు. అంతేకాకుండా కాలేయ వ్యాధితో పాటు సిఓపిడి, మూత్రపిండాల సమస్య, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఆ రోగి ప్రమాదకరమైన పరిస్థితిలో ఉండడంతో ఆయనకు గుండె సంబంధిత ఆపరేషన్ చేయడం క్లిష్టతరమైందని తెలిపారు. గుండెకు సంబంధించిన కవాటాలు క్షీణించి, స్ట్రోక్ వచ్చే ప్రమాదం అధికంగా ఉందని గుర్తించి, సెంటినెల్ సెరిబ్రల్ ప్రొటెక్షన్ పరికరంతో ధమని కవాటాల ఇంప్లాంటేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసి, ఆ వృద్ధుడిని గుండెపోటు ప్రమాదం నుంచి కాపాడినట్లు ఆయన పేర్కొన్నారు. టిఏవిఐ ప్రక్రియలో స్ట్రోక్ రిస్క్ ఉంటుందని, అయితే సెంటినెల్ పరికరం ద్వారా చేసే చికిత్సలో టిఏవిఐలో స్ట్రోక్ రిస్క్ ఉండదని ఆయన వివరించారు. రోగులకు సరికొత్త సాంకేతికతను అందించడంలో చెన్నై అపోలో ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రమాదకరమైన గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి ఈ సెంటినెల్ సెరిబ్రల్ ప్రొటెక్షన్ పరికరంతో చేసే చికిత్స వారికి నూతన జీవితాన్ని ప్రసాదిస్తుందని, దీనిని హృద్రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

# జాతీయస్థాయి పోటీల్లో.. ఎన్‌బికెఆర్‌కు ద్వితీయస్థానం




ఎస్ఏఇ ఈ-బాజా 2022 పోటీల్లో కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌కు జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం లభించింది. ఎస్ఏఇ - ఇండియా జాతీయ స్థాయిలో ప్రతి ఏటా నిర్వహించే ఈ పోటీల్లో తాజాగా 215 ఇంజనీరింగ్ కళాశాలలు పాల్గొన్నాయి. మూడు దశల్లో విద్యార్థులు ఒక సింగిల్ సీటర్ ఆల్ టెర్రయిన్ వెహికల్ (ఏటివి)ని డిజైన్ చేయడం, పరీక్షించడం, ధృవీకరించడం వంటి అంశాల్లో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. ఈ ప్రతిష్టాత్మక పోటీలో ఎన్‌బికెఆర్ మెకానికల్ విద్యార్థులు జాతీయస్థాయిలో వర్చువల్ డైనమిక్ ఈవెంట్ (విడిఇ) విభాగంలో ద్వితీయస్థానం కైవసం చేసుకోవడం విశేషం. ఈ పోటీల్లో 25మంది విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడి వివిధ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి ఒక ఎలక్ట్రిక్ ఆల్ టెర్రియన్ వెహికల్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తమ విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు రెగ్యులర్ పాఠాలతో పాటు పలు సాఫ్ట్‌వేర్‌లపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఆ విభాగాధిపతి డా.సిహెచ్ విక్రమ్‌కుమార్ చెప్పారు. ఎస్ఏఇ ఫ్యాకల్టీ అడ్వయిజర్ డా. వై.అశోక్‌కుమార్‌రెడ్డి, టీమ్ కెప్టెన్ బ్రహ్మానందరెడ్డి, వైస్ కెప్టెన్ దత్తదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 1 నుంచి.. శ్రీ సౌభాగ్య సరస్వతి అమ్మవారి వైభవోత్సవాలు

- కుర్తాళం పీఠాధిపతి సమక్షంలో పూజలు



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలో కొలువైవున్న శ్రీ సౌభాగ్య సరస్వతి అమ్మవారి దివ్య వైభవోత్సవాలు జూలై 1 నుంచి 4వతేది దాకా కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠాధిపతులు, పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో జరుగనున్నాయని ఆ పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా జూలై 1వ తేది సాయంత్రం 4.30 నుంచి నెల్లూరులోని అయ్యప్పస్వామి దేవస్థానం దగ్గరనుంచి పప్పులవీధిలోని శ్రీ గురు దత్తాత్రేయ మఠం దాకా కుర్తాళం పీఠాధిపతులు, తిరుపతి శ్రీశక్తి పీఠాధీశ్వరుల వారి స్వాగత శోభాయాత్రను నయనానందకరంగా నిర్వహిస్తామని, ఆటు ఆలయంలో పూజలు, ఇటు స్వామివారి అనుగ్రహభాషణలు వైభవంగా ఉంటాయని, భక్తులందరూ ఈ కార్యక్రమాలకు తరలిరావాలని ఆయన కోరారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా శ్రీ సౌభాగ్య సరస్వతి అమ్మవారి దేవస్థానాన్ని ఆగస్టు నెలలో పునర్నిర్మాణం చేస్తున్నామని, భక్తులు తమ సహాయ సహకారాలందించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

'కృషితో నాస్తి దుర్భిక్షం'

'కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు.. మహాపురుషులౌతారు
తరతరాలకి తరగని వెలుగౌతారు.. ఇలవేలుపులౌతారు'



శ్రీ సిటి వేదికగా.. తెలుగు నాట పారిశ్రామిక విప్లవానికి నాంది పలికి,
వందలాది పరిశ్రమలతో.. వేలాది మందికి ఉపాధి చూపిస్తూ,
విక్రమ సింహపురి యూనివర్సిటీ వారి నుండి
గౌరవ డాక్టరేట్ అందుకున్న
డాక్టర్ రవి గారూ
మీకివే మా జేజేలు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com